J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 04.09.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## మత్తెక్కిస్తున్న మద్యం మాఫియా...

# నిషేధానికి ముందే నిషా



- ఆంధ్రాలో ఏరులై పారుతున్న పక్క రాష్ట్రాల మద్యం
- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో రాష్ట్ర ఆదాయానికి భారీగా గండి

*"ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు జగ్గయ్యపేట వద్ద గ్యాస్ సిలిండర్‌లో 100 సీసాల అక్రమ మద్యం పట్టివేత."*

*"కర్ణాటక, ఆంధ్రా సరిహద్దు పలమనేరు వద్ద లారీలో వడ్లపొట్టు లోడు కింద 25 కేసుల విస్కీ లభ్యం."*

*"ఆంధ్రా తమిళనాడు బోర్డర్ తడ వద్ద కూరగాయల ఆటోలో భారీస్థాయిలో అక్రమ మందు."*

*"ఒడిస్సా, ఆంధ్రా సరిహద్దు ఇచ్ఛాపురం వద్ద బట్టల మధ్యలో గుట్టలగుట్టల మద్యం."*

*"ఆంధ్రా, ఛత్తీస్‌ఘడ్ బోర్డర్‌లోని చింతూరు దగ్గర కారులో జోరుగా మద్యం తరలింపు."*

ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సరిహద్దుల్లో కోకొల్లలు జరుగుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి పన్ను చెల్లించని నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాష్ట్రంలో విచ్చలవిడిగా, ఏరులై పారుతోంది. ఖచ్చితంగా చెప్పాలంటే రాష్ట్రంలోని మద్యం డిపోలలో ఉన్న స్టాక్‌కి పదింతలు, అక్షరాలా అంతకుమించి ఇతర రాష్టాల మద్యం రాష్ట్రంలో అందుబాటులో ఉంది. ఒక్క స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పైస్థాయిలో కొందరు అధికారులకు తప్ప ఈ విషయం అందరకీ తెలుసు, అయినా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్టు కనిపిస్తున్నారు ఎస్‌ఈబీ అధికారులు.

### దశాలవారీ మద్య నిషేధంతో 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత ఆశయం, లక్ష్యంతో దశల వారీ మద్య నిషేధానికి నడుం బిగించింది. తన సుదీర్ఘ పాదయాత్రలో అప్పటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్యం వల్ల ఇల్లు గుల్లై, పిల్లలను చదివించలేక, అనారోగ్యాలపాలై, చివరకు తాగి తాగి భర్తలు చనిపోతే కుటుంబాలను పోషించలేని ఆడబిడ్డల అవస్థలు చూడలేక ఈ మహమ్మారిని శాశ్వతంగా రాష్ట్రం నుంచి దూరంచేయాలని దశలవారీ మద్య నిషేధానికి నడుం బిగించారు. అందులో భాగంగా ధరల పెంపుతో పాటు మొదటి ఏడాదిలోనే మద్యం దుకాణాల సంఖ్యను దాదాపు 40 శాతంకు కుదించారు. ధర పెంచడం, అందుబాటులో లేకుండా చేయడం ద్వారా మద్యపాన ప్రియుల్లో దాని పట్ల ఆసక్తిని తగ్గించడం, ఒక రకంగా మద్యంపై ఏహ్యాభావాన్ని పెంపొందించడం, 5 ఏళ్ల తర్వాత పూర్తిగా దానిని తొలగించడం ప్రభుత్వ ఉద్దేశం. కానీ మనం ఒకటి ఆలోచిస్తే దైవం మరొకటి ఆలోచిస్తుంది అన్నట్లు, ప్రభుత్వ ఉద్దేశం ఒకటైతే ఆ అలవాటును మానలేని మద్యం ప్రియులు, వాళ్ళ బలహీనతలపై వ్యాపారం చేసే మద్యం అక్రమ రవాణాదారులు, వాళ్ళ నుంచి లాభపడే కొందరి అధికారుల ఆలోచన వేరేలా ఉంది. ఇదేదో అంది వచ్చిన అవకాశంగా భావించిన ఈ ముఠా, రాష్ట్ర ఆదాయాన్ని గండి కొట్టే విధంగా ఇతర రాష్ట్రాలలో పన్ను చెల్లించి చేస్తోన్న అక్రమ రవాణా (మిగతా 11వ పేజీలో)









# రాజన్నకు ఘన నివాళి

**దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఈనెల 2న బుధవారం రోజున కడపజిల్లాలోని ఇడుపులపాయలో ఉన్న వైయస్సార్‌ఘాట్‌లో తన తండ్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్. అనంతరం సమీపంలో ఉన్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ట్వీట్‌చేస్తూ 'నాన్న మరణించి ఇప్పటికి పదకొండేళ్ళు. మహానేత వైయస్సార్ శరీరానికి మరణం ఉంటుంది కానీ ఆయన జ్ఞాపకాలకు, ప్రజల కోసం ఆయన రూపొందించిన పథకాలకు ఎప్పుడూ మరణం ఉండదు. నా ప్రతి అడుగులోనూ నాన్న తోడుగా ఉంటూ నన్ను ముందుకు నడిపిస్తూనే ఉన్నారు'.. అని పేర్కొన్నారు. తల్లి వైయస్ విజయమ్మ, సతీమణి భారతీరెడ్డి, టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ తదితర కుటుంబసభ్యులతో కలసి సి.ఎం జగన్ తన తండ్రి డాక్టర్ వైయస్సార్ స్మృతికి అంజలి ఘటించారు.

నెల్లూరుజిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు నగరంలో (మిగతా 10వ పేజీలో)



## ఆయన శ్వాస-ధ్యాస... అంతా "కస్తూరిదేవి విద్యా సంస్థలే!"

# బహుముఖ ప్రజ్ఞాశాలి.. జె.వి.రెడ్డి కన్నుమూత


శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ మరియు కరెస్పాండంట్ జక్కా వెంకట్రామిరెడ్డి (జెవి రెడ్డి) ఆగస్టు 30వ తేది రాత్రి తెల్లవారితే 31, తన 87వ యేట అకస్మాత్తుగా కన్నుమూశారు. ఆయనకు భార్య జానకమ్మ, కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె శరణ్యలు కాగా, కుమారుడు హర్ష 1997లో చిరుప్రాయంలోనే పరమపదించాడు. కుమార్తె శరణ్య అమెరికాలో స్థిరపడిపోయారు. కోడలు స్వప్న, మనుమరాళ్ళు(హర్ష కుమార్తెలు) సంజన, సుస్మిత చెన్నైలో వుంటారు. జెవిరెడ్డి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం మండలం, కాగులపాడు, జక్కా బలరామిరెడ్డి-వెంకట శేషమ్మ దంపతులకు 1933 జనవరి 7న ఆయన జన్మించాడు. తన అమ్మమ్మ వాళ్ళ ఊరు పొట్టేపాళెంలో ఆయన పుట్టాడు. తల్లి వెంకట శేషమ్మ స్వాతంత్ర్య సమరయోధురాలు. బెజవాడ రామచంద్రరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డిలతో కలసి ఆమె ఉద్యమంలో పాల్గొన్నారు.

### బాల్యం.. విద్యాభ్యాసం...

జెవిరెడ్డి 1937 నుండీ 1940 వరకు కాగులపాడులో 1 నుండి 3వ తరగతి వరకు చదువుకుని ఆ తరువాత 4, 5, తరగతులు వెంకట్రావు మునిసిపల్ స్కూల్‌లో చదువుకున్నాడు, అప్పట్లో నాగిశెట్టి లక్ష్మయ్య ఆయనకు గురువు. అనంతరం 6 నుండి ఎస్ఎస్ఎల్‌సి వరకూ విఆర్ హైస్కూల్‌లో విద్యనభ్యసించాడు. అయన 8వ తరగతి చదువుతున్నప్పుడే అదే ఏడాది నుండి విఆర్‌హైస్కూల్‌లో ఆంగ్ల మాధ్యమం(ఇంగ్లీష్ మీడియం) ప్రారంభ మయ్యింది. ఇంగ్లీష్ మీడియం మొదటి బ్యాచ్ విద్యార్థిగా ఇంగ్లీష్ ప్రభావం ఈయనపై గట్టిగా పడింది. అప్పటి హెడ్‌మాస్టర్ కాకుటూరు నరసింహా రావు, అయ్యవార్లు అక్కరాజుల రామ్మూర్తి, విరలరావుల స్ఫూర్తితో ఆయ నకు ఇంగ్లీషులో బలమైన పునాది పడింది.

1949 నుండి 51 వరకు మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఏ ఎకనామిక్స్ చదివాడు. 1953-55మధ్యకాలంలో బెంగళూరులో లా చదివాడు. జెవిరెడ్డికి చిన్న తనంనుండి వ్యాపారం పై మక్కువ ఎక్కువ. తమ గ్రామం కాగులపాడులో 6 నెలలు వ్యవసాయం చేస్తే మిగిలిన 6 నెలలు వడ్డీ వ్యాపారం చేసుకుంటూ కోడి పందాలు, గుర్రపు పందాలతో ఆ ఊరి జనం కాలక్షేపం చేసేవారు. జెవి రెడ్డి కుటుంబానికి కూడా మంచి గుర్రాలు ఉండేవి. ఆయనది చాలా శ్రీమంతుల కుటుంబం ఆ రోజుల్లో వీరికి "స్టుడిబేకర్" కారు ఉండేది.

### వివాహం.. వ్యాపారం...



భార్య జానకమ్మతో జె.వి.రెడ్డి

చదువు పూర్తైన తరువాత 1956లో టంగుటూరి వారి ఆడపడుచు జానకిని జెవిరెడ్డి పెళ్లాడాడు. అప్పట్లో వీరిద్దరూ వెళ్తుంటే అందరూ కళ్ళార్పకుండా చూసేవారట, వారిది అంతటి అందమే కాకుండా చూడ ముచ్చటైన జంటగా అందరు చెప్పుకునేవారని అంటారు.

రేబాల దశరథరామిరెడ్డిగారి దగ్గర కొంతకాలం అప్రెంటిస్‌గా చేసి అనంతరం తన దృష్టిని వ్యాపారంవైపు మరల్చాడాయన.

అప్పట్లో ఆటో ఫైనాన్స్ కావాలంటే ఎవరైనా చెన్నైకి వెళ్లాల్సిందే. ప్రజల అవసరాల కోసం పడుతున్న ఇబ్బందులను గమనించిన జెవి రెడ్డి తన గ్రామం తమ కుటుంబం ఆనవాయితీగా చేసే వడ్డీ వ్యాపారాన్ని 1957లో "నెల్లూర్ ఫైనాన్స్ కార్పొరేషన్ " పేరుతో ప్రారంభించాడు. అనతికాలంలోనే ఆ వ్యాపారం దినదినాభివృద్ధి చెంది ఆ రోజుల్లోనే ఏడాదికి కోటి రూపాయలు వార్షిక టర్నోవర్ చేసే స్థాయికి ఎదిగింది.

ఆ తరువాత పదేళ్లకు 1967లో నెల్లూరు స్ట్రా బోర్డ్స్ పరిశ్రమను తన మిత్రుడితో కలసి ప్రారంభించాడు.

### సామాజిక జీవితం...

నెల్లూరు క్లబ్ సభ్యుడిగా ఆయన సారధ్యంలో 16 సంవత్సరాలు టెన్నిస్ టోర్నమెంట్లు జరిగాయి. అప్పట్లో జిల్లాకి వచ్చిన ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు జెవిరెడ్డితో పరిచయం చేసుకుని ఆయనతో స్నేహం చెయ్యడానికి ఇష్టపడేవారు. యంఎస్.వీరరాఘవన్, హెచ్‌కే బాబు, యం.సాంబశివరావు వంటివారు జిల్లా కలెక్టర్లుగా వున్న సమయంలో జెవిరెడ్డితో అత్యంత ఆత్మీయంగా మెదిలేవారు.

### రోటరీ సభ్యుడిగా...

తాను చేయదలుచుకున్న సేవలకు వేదికగా ఆయన రోటరీని ఎంపిక చేసు కున్నాడు. 1967లో రోటరీ సభ్యత్వం తీసుకుని అనతికాలంలోనే విశేషగుర్తింపును పొందాడు. తానూ ఏ పని చేసినా క్రమశిక్షణ, అంకితభావంతో పాటు చిత్తశుద్ధితో చేసేవాడు. రోటరీ క్లబ్ ద్వారా ఆయన చేసిన సేవలు అపారం. 1990-91లో రోటరీ జిల్లా 3160 విభాగానికి గవర్నర్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. ఆంధ్రాలోని నెల్లూరు, కడప, అనంతపూర్ , కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటకలోని 6 జిల్లాలు ఈ విభాగం క్రిందకు వస్తాయి.

### రాజకీయ, సాహిత్య, సేవా రంగాలలో...



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో...

వ్యాపార రంగంతో పాటు సాహిత్య, సేవ, రాజకీయ రంగం పట్ల కూడా ఆయన ఎక్కువ ఆసక్తి చూపేవాడు. తన కుటుంబమంతా కాంగ్రెస్ పార్టీ అభిమానులుగా ఉన్నప్పటికి ఈయన మాత్రం బెంగళూరులో చదివేటప్పుడు మార్క్సిస్ట్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆ తరువాత రోజుల్లో ఆర్ఎస్ఎస్ చేపడుతున్న కార్య కలాపాల పట్ల ముగ్ధుడై, ఆర్ఎస్ ఎస్‌ను ఒక రాజకీయ పార్టీగా కాకుండా దేశభక్తిని పెంపొందించే సిద్ధాంత వ్యవస్థగా భావించి ఆ సంస్థ సభ్యుడిగా మారి తన చివరి శ్వాస వరకు రాష్ట్రీయ సేవా సంఘ్ సిద్ధాంత కర్తగానే వుండిపోయాడు. ఈ సంస్థ ద్వారానే ఆయనకు వెంకయ్యనాయుడుతో పరిచయం ఏర్పడింది. బల మైన సిద్ధాంతాలు కలిగిన ఆర్ఎస్ఎస్ ఆరాధకుడిగా వెంకయ్య జెవిరెడ్డిని గౌరవించేవాడు. కవికోకిల దువ్వూరు రామిరెడ్డి జయంతితో పాటు కవిత్రయ జయంతులను, తిక్కవరపు రామిరెడ్డి స్మారక సభలను ఆయన జరిపించడంతోపాటు నిత్యం టౌన్‌హాల్‌లో జరిగే అనేక సాహిత్య, సాంస్కృ తిక సభలకు ఆయన పోషకుడిగా ఉండేవాడు. ఆర్ఎల్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా అనేకమంది పేదవారి విద్య వైద్యం కోసం సహాయం చేసేవాడు. ప్రగతి చారిటీస్ ప్రారంభించినప్పుడు మొట్టమొదటిగా 50వేల రూపాయలను తాను ఇవ్వడమే కాకుండా తనకు తెలిసినవారి చేత కూడా సహాయం చేయించాడు. నగరంలోని వాత్సల్య, ఇస్కాన్ వంటి సంస్థలతోపాటు రెడ్‌క్రాస్ కాన్సర్ ఆసుపత్రికి కూడా 5లక్షల విరాళాన్ని ఆయన అందించాడు.



బెజవాడ గోపాలరెడ్డి గారి విగ్రహావిష్కరణ సభలో ఆనాటి ముఖ్యమంత్రి డా. వైయస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా సత్కారం అందుకుంటూ...

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ అధ్యక్షుడిగా అనేకమంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులను నెల్లూరుకు రప్పించి గోపాలరెడ్డిగారి అవార్డుతో వారిని సత్కరించాడు. ఆయన ఆధ్వర్యంలో గోపాలరెడ్డి గారి విగ్రహ ప్రతిష్ట బాధ్యతలను కూడా తన భుజానికెత్తుకున్నాడు.

### కస్తూరిదేవి విద్యాసంస్థల బాధ్యతలు

1994లో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు జెవి రెడ్డిని ఇంటికి పిలిపించుకుని మరీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థ బాధ్యతలను అప్ప జెప్పాడు. సెక్రటరీ మరియు కరస్పాండెంట్‌గా జెవిరెడ్డిని నియమించి వందల కోట్ల ఆస్తిని గడచిన తరాల ఆశయాన్ని అయన చేతిలో పెట్టాడు. గోపాలరెడ్డిగారు ఆయనపై పెట్టిన బాధ్యతను జె.వి.రెడ్డి ఎప్పుడూ విస్మరించలేదు, గోపాలరెడ్డిగారు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీయలేదు, 26 సంవత్సరాల పాటు ఆయన చివరిశ్వాస వరకు శ్రీ కస్తూరిదేవి సంస్థల ఆస్తులని, వ్యవస్థాపకులు ఆశయాలని కాపాడుతూనే వచ్చాడు. మహిళల విద్యకోసం అవతరించిన సంస్థలో బెజవాడ గోపాలరెడ్డి ఉమెన్స్ అకాడమీ పేరుతో మహిళల కోసం ప్రత్యేకంగా ఒక డిగ్రీ కాలేజీని ప్రారంభించి ప్రగతి బాటలో నడిపించాడు. ఎన్ని కష్టాలొచ్చినా, ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం లేకపోయినా శ్రీ కస్తూరిదేవి బాలికల విద్యాలయాన్ని మంచి ఫలితాలతో అగ్ర స్థానంలో నిలిపాడు.

### 'లాయర్'తో అనుబంధం...

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారితో జెవి రెడ్డికి అపురూప అనుబంధం వుంది, అదే ఆప్యాయతని ఆయన చివరిశ్వాస వరకు లాయర్ కుటుంబంపై చూపించేవాడు, లాయర్ అనుబంధ సంస్థలుగా ప్రారంభమైన 'రూపాయాడ్స్'ని 1992లోను, 'రూపాగ్రాఫిక్స్'ని 1994లోను జెవిరెడ్డి అమృతహస్తాలతో ప్రారంభించారు.

### ఎవర్‌గ్రీన్ హీరో...

ఆయన మనిషి పాత తరం వాడైనా ఆలోచనలు, ఆశయాలు ఎప్పుడూ కొత్తదనంతో ఉండేవి. మారుతున్న కాలంతో పాటు ఆయనా మారుతూ వచ్చాడు. ఎప్పుడు నీట్‌గా డ్రెస్ చేసుకునేవాడు. సమయ పాలనకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవాడు. వ్యాపార వ్యవహారాలలో కఠినంగా ఉన్నా ప్రేమానురాగాలతో కూడిన స్నేహ పరిమళాలను వెదజల్లేవాడు. ఆయనలా ఇంగ్లీషులో మాట్లాడగలిగిన ఆ తరం వారు బహుశా నెల్లూరులో ఇప్పుడెవరూ వుండబోరు, 'ది హిందూ' ఆంగ్ల పత్రికకు ఆయన నిత్యం అనేక వ్యాసాలు లెటర్లు వ్రాసేవాడు. తాను నమ్మిన సిద్ధాంతాలని, ఆచారాలని, ఎప్పుడూ ఎక్కడా వదిలిపెట్టకుండా తనదైన స్టయిల్‌లో 87 సంవత్సరాల సుదీర్ఘ జీవితాన్ని గడిపి 88వ యేట అకస్మాత్తుగా కనుమరుగైపోయాడు జెవి రెడ్డి. ఆయనో అరుదైన వ్యక్తి, అయన వ్యక్తిత్వం ఆచరణీయం. భావితరాలకు అనుసరణీయం. ఆయన ఆత్మశాంతికై ప్రార్థిస్తోంది 'లాయర్'.

### పెద్దమనిషి జెవిరెడ్డి - ఉపరాష్ట్రపతి వెంకయ్య

నెల్లూరుజిల్లాలో పెద్దమనిషి అని పేర్కొనదగిన వారిలో జెవి రెడ్డి ఒకరని, భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత నిజాయితీ కలిగిన వ్యక్తిగా జెవి రెడ్డి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడని, విద్యా రంగంలో సైతం ఆయన చేసిన సేవలు మరువలేనివని వెంకయ్యనాయుడు జెవి రెడ్డి శ్రీమతి జానకమ్మకు పంపిన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

### ఆయనొక లెజెండ్... - రాజ్యసభ సభ్యుడు విపిఆర్

జెవి రెడ్డి తనకు ఆత్మబంధువని, తన కుటుంబానికి అత్యంత సన్నిహితుడని, ఆయన మరణం తనకు తీరని లోటని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నాడు. ఆయనొక లెజెండ్ అని, భావితరాలకు స్ఫూర్తి అని, ఆయనను చూసి చాలా మంది సమయపాలన క్రమశిక్షణ నేర్చుకున్నారని, ఆయన మరణం తనను కలచివేసిందని విపిఆర్ తన సంతాపాన్ని వ్యక్తంచేశాడు. పార్టీలకు అతీతంగా అందరితో కలుపుగోలుగా ఉండేవాడని, కస్తూరిదేవి సంస్థల అభ్యున్నతికి నిరంతరం తపించేవాడని ఆయన లేని లోటు పూడ్చలేనిదని ప్రభాకరరెడ్డి అన్నాడు.

## నేతలు, అధికారులు..

# ప్రగల్భాలు మాని.. పనితనం చూపాలి!

పబ్లిక్ డిమాండ్

**ప్రైవేటు ఆసుపత్రులలో రోగుల నుండి ఎక్కువ మొత్తంలో డబ్బు వసూలు చేయకూడదని, ఆలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయకులు, అధికారులు పదే పదే చెప్తున్నారు. కానీ కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి లక్షలు లక్షలు గుంజుతున్నాయి. నేతలూ అధికారులూ ప్రగల్బాలు పలుకుతున్నారు తప్ప పనితనం చూపడంలేదు. పక్క రాష్ట్రం తెలంగాణలో ముఖ్యమంత్రి ఆదేశాలను అధికారులు ఖచ్చితంగా అమలుచేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్నే వసూలు చేస్తున్నారు. మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేస్తున్నా, తరచూ అధికారులను ఆదేశిస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. క్రిందిస్థాయిలో సరైన నిఘా లోపించి సమన్వయం కరువు కావడమే ఇందుకు ప్రధాన కారణం.**

### తెలంగాణలో...

ఆయన పేరు శేఖర్‌రెడ్డి (పేరు మార్చాము). సాధారణ రైతు. వయస్సు 62 సంవత్సరాలు, సొంతూరు జమ్మల మడుగు. ఆయనకు కరోనా వైరస్ సోకిన 6రోజులకు కానీ గుర్తించలేదు. ఎన్నిసార్లు పరీక్షలు చేయించినా నెగటివ్ వచ్చింది, చివరికి ముక్కులో నుండి నోట్లో నుండి రక్తం రావడంతో డాక్టర్ల సూచన మేరకు సి.టి స్కాన్ చేయిస్తే వైరస్ ప్రమాదకర స్థాయిలో ఉందని, వెంటనే ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చేర్చుకున్నారు. అయితే సాయంత్రానికి పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ అవసరమని నెల్లూరుకు లేదా హైద్రాబాదుకు వెళ్ళమని వైద్యులు సూచించారు.

నెల్లూరుకన్నా హైదరాబాదులో మెరుగైన వైద్యం లభిస్తుందని అక్కడినుండి అంబులెన్సు మాట్లాడుకుని పేషెంట్‌ని హైదరాబాదులోని పెద్ద కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. (ఇక్కడ అత్యవసరాన్ని సొమ్ము చేసుకున్న అంబులెన్సు యజమాని, ప్రొద్దుటూరు నుండి హైదరాబాదుకు 60 వేల రూపాయలు డిమాండ్ చేసి వసూలు చేశాడు). హైదరాబాదులో రోగిని పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి చేయి దాటి పోయిందని, అయినా తమ ప్రయత్నం తాము చేస్తామని చెప్పి వెంటనే అడ్మిట్ చేసుకుని వైద్యం మొదలుపెట్టారు. అనేక టెస్టులు నిర్వహించారు, ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచుకుని మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. 6 రోజుల పాటు ఐసియులో ఉంచి ఆ తరువాత 4రోజులు రూములో ఉంచి మొత్తం 10 రోజుల తరువాత రోగిని ఆరోగ్యవంతుడిగా ఇంటికి పంపించారు. ఈ పది రోజుల వైద్యానికి ఆ పేషెంట్‌కి అయిన ఖర్చు 4,10,000/- అక్షరాలా నాలుగు లక్షలా పది వేలు. పేషెంటుకి ఇన్సూరెన్సు ఉండడంతో ఆసుపత్రి యాజమాన్యం ప్రతి రూపాయికీ బిల్లు రెడీ చేసి పేషెంటుకి ఇచ్చేసింది.

### ఆంధ్రాలో...

అతని పేరు రమేష్(పేరు మార్చాము). నెల్లూరులో నివసిస్తున్నాడు. వయస్సు 55 సంవత్సరాలు. ఒక చిన్న హార్డ్‌వేర్ దుకాణంలో గుమస్తా. కరోనా లక్షణాలు స్వల్పంగా కనిపించాయి. పెద్దగా ఇబ్బంది పడలేదు. ఆసింటమాటిక్ అని తేలింది. హోమ్ క్వారంటైన్‌లో వుంటే సరిపోతుందన్నారు, కానీ అయన భయపడ్డాడు. నెల్లూరు పొగతోటలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. చేరిన వెంటనే టెస్టులు, స్కానులు అంటూ 45 వేలు వసూలు చేశారు. ఆ తరువాత ఆయన 5రోజులు ఆసుపత్రిలో వుండి డిశ్చార్జ్ అయ్యాడు. రెమిడీసివెర్ ఇంజక్షన్ కోసం 36 వేలు కట్టించుకున్నారు. ఇక చివరిగా 5వ రోజు ఆసుపత్రి రూము బిల్లు ఇతర చార్జీలు అంటూ మరో 1,75,000/- కట్టించుకున్నారు. కేవలం స్వల్ప లక్షణాలు వున్నా భయంతో ఈ రోగి చెల్లించిన మొత్తం 2,56,000/- అక్షరాలా రెండు లక్షలా యాభై ఆరు వేలు. బిల్లులు అడిగితే ఇవ్వలేదు. బ్రేకప్ అడిగితే చెప్పలేదు, పైగా నిన్ను బ్రతికించాం పో.. అంటూ సమాధానం చెప్పి ఇంటికి పంపించేశారు.

### రెండిటికి వ్యత్యాసం .....

మొదటిది మహానగరం హైదరాబాదులో అతిపెద్ద కార్పొరేట్ ఆసుపత్రి. ఇక్కడ రోగి 6రోజులు ఐసియులో వున్నాడు, 4 రోజులు రూంలో వున్నాడు, వెరసి మొత్తం 10రోజులు ఆసుపత్రిలోనే వున్నాడు, కానీ కేవలం ఆయనకు అయిన బిల్లు 4లక్షలే. ఇదే ఆసుపత్రిలో సాధారణ పరిస్థితుల్లో అయితే ఒక్క ఐసియుకే రోజుకి లక్ష రూపాయలవుతుంది. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనల కారణంగా బిల్లు సగంకంటే తక్కువే అయ్యింది.

రెండవది జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఒక సాధారణ ప్రైవేటు ఆసుపత్రి. కాంక్రీట్ జంగిల్ లాంటి ఇరుకు సందుల్లో కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా వుండని వైద్యశాల. అక్కడ రోగి తీవ్రతతో పోల్చి చూస్తే ఇక్కడ పేషెంటుది జబ్బుకన్నా భయమే పెద్దది. ఇక్కడ ఐసియు అవసరమే రాలేదు. అక్కడి వసతులతో పోల్చి చూస్తే ఇక్కడ అసలు వసతులే లేనట్లు లెక్క. మరి ఇక్కడ కూడా ప్రభుత్వ నిబంధనలున్నాయి, కానీ బిల్లు మాత్రం పేలిపోయింది.

### ఇదీ పరిస్థితి...

ఆంధ్రాలో ఇదీ పరిస్థితి. మిగతా జిల్లాలలో, నగరాలలో ఎలా వున్నా నెల్లూరులో మాత్రం రోగుల పరిస్థితి దయనీయంగా వుంది. ముఖ్యమంత్రి గారి నుండి మాకు స్పష్టమైన ఆదేశాలున్నాయి, తేడాలొస్తే తాట తీస్తాం అంటున్నారే తప్ప, అటు అధికారులు కానీ ఇటు రాజకీయ నేతలు కానీ ఇప్పటివరకు ఒక్కచోట కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దొరికిన మేరకు దోచుకోవడమే కాకుండా, ఇన్సూరెన్స్ క్లయిమ్ చేసుకోవడానికి అవసరమైన బిల్లులు కూడా ఇవ్వకుండా రోగులను ఇబ్బంది పెడుతున్నాయి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు.

### బోర్డులు పెట్టించాలి...

ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకోమంటున్న ప్రభుత్వం ఆ చికిత్సకు రోగి దేనికెంత చెల్లించాలో స్పష్టత ఇవ్వడంలేదు. అరాకొరా ప్రకటనలిచ్చి సరిపెడుతోంది తప్ప, ఆసుపత్రుల ముందు రేట్ల పట్టికను పెద్దపెద్ద అక్షరాలతో బోర్డుపై ప్రదర్శించాలన్న నిబంధనను గట్టిగా అమలు చెయ్యలేకపోతోంది. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఈ విషయంలో గట్టిగా ఉన్నా క్రింది స్థాయి సిబ్బంది ఇక్కడకూడా చేతివాటం ప్రదర్శించి చూసీ చూడనట్లుగా వెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### ఒక అధికారిని పూర్తిస్థాయిలో నియమించాలి

ఉన్న కొద్దిపాటి ప్రైవేటు ఆసుపత్రులలో ఒక్కొక్క ఆసుపత్రిలో ఒక్కో ప్రభుత్వ అధికారిని పూర్తి స్థాయిలో నియమిస్తే ఈ అరాచకాలను అడ్డుకోవచ్చున్నది ప్రజాభిప్రాయం. కష్టాలతో వచ్చే ప్రజలను ఇంకా కష్టనష్టాల పాలు చేస్తున్న ఈ ప్రైవేటు ఆసుపత్రుల దురాగతాలను అడ్డుకుని వారి ధనదాహాన్నుండి తమని కాపాడమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పక్క రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తున్న విధానాలను మీరెందుకు చెయ్యలేరని ఇక్కడి నేతలనూ అధికారులనూ వారు ప్రశ్నిస్తున్నారు.


**- సంచారి**


అశ్రునివాళి

1992లో మా సంస్థ 'రూపాయాడ్స్'ని
1994లో 'రూపా గ్రాఫిక్స్'ని
తన సువర్ణహస్తాలతో ప్రారంభించి,
నిండుమనసుతో దీవించి,
మా అభివృద్ధిని కాంక్షించి,
అన్నివేళలా మాకు కొండంత అండగా నిలిచిన
మా శ్రేయోభిలాషి, హితైషి

జె.వి.రెడ్డన్న

ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...
కన్నీటి నివాళి అర్పిస్తున్నాం.



జననం : 07.01.1933
మరణం : 31.08.2020

# 'ప్రభా'తం

'ప్రజా జీవితంలో అత్యున్నత ప్రమాణాలు పాటించిన వ్యక్తి ప్రణబ్ ముఖర్జీ. ఆయన మరణంతో మహోన్నతమైన కుమారుడిని కోల్పోయిన దేశం శోకతప్తమైంది.' **- భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.**

'ప్రణబ్ ముఖర్జీ మహాజ్ఞాని. రాజనీతిజ్ఞుడు. రాజకీయపార్టీలకు అతీతంగా ఆయన అందరికీ స్ఫూర్తిప్రదాత. దేశ అభివృద్ధి పథంలో ఆయన స్థానం చిరస్మరణీయమైనది.' **- ప్రధాని నరేంద్రమోడీ.**

బహుముఖ ప్రజ్ఞాశాలి.. రాజనీతిజ్ఞుడు.. భారత రాజకీయాల్లో అనర్ఘరత్నం.. మన 'భారతరత్న'ం.. మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ 84ఏళ్ళ వృద్ధాప్యంలో మెదడులో రక్తం గడ్డకట్టి అనారోగ్యంతో పోరాడుతూ గతనెల 31వ తేది సోమవారం ఢిల్లీలోని ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారన్న సమాచారం భారతప్రజలను శోకసాగరంలో ముంచింది. తనకు కరోనా సోకినట్లు నిర్ధారణ అయిందని కూడా ఆయనే స్వయంగా గతనెల 10వ ట్వీట్ చేశారు. ఆ తర్వాత అనారోగ్యంతో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ 21 రోజుల పాటు జీవన్మరణ పోరాటం చేసి చివరికి మృత్యుఒడికి చేరుకున్నారు. ఆయన మరణంతో దేశరాజకీయాల్లో ఓ శకం ముగిసినట్లయింది.

దాదాపు యాభైఏళ్ళ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో తలపండిన రాజనీతికోవిదుడు, అపర చాణుక్యుడు.. దేశరాజకీయాల్లో తనదంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్న అరుదైన నాయకుడు ప్రణబ్ ముఖర్జీ. ఎన్ని కష్టాలెదురైనా, ఎన్ని సంక్షోభాలు చుట్టుముట్టినా వెరవక అంతులేని కృషితో పట్టుదలతో విజయాలను సాధించగలిగిన అపార ప్రజ్ఞావంతులాయన. మచ్చలేని నాయకునిగా, నిష్కళంక రాజకీయవేత్తగా రాజకీయాల్లో విలువలకు పట్టం గట్టిన విశిష్ట రాజనీతిజ్ఞునిగా ఘనకీర్తి సాధించారు. భరతమాత ముద్దుబిడ్డగా, 'భారత రత్న'గా ప్రజలందరి అభిమా నాన్ని చూరగొన్నారు. దేశంలోనే అత్యు న్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని చేపట్టి దేశానికి చిరస్మరణీయమైన సేవలందించారు.

పశ్చిమబెంగాల్‌లోని మిరాఠి అనే చిన్న గ్రామంలో 1935 డిసెంబరు 31వ జన్మించిన ప్రణబ్ చిన్నతనం నుంచే కష్టాలను ఎదుర్కొన్నారు. రోజూ కనీసం పదికిలోమీటర్లకు పైగానే కాలినడకన బడికి వెళ్ళేవారు. వర్షాలు వస్తే మధ్యలో వాగు ఈదుకుని వెళ్ళి చదువుకునేవారు. చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయభావాలతో ఎదిగారు. తపాలాశాఖలో సామాన్యమైన ఉద్యోగంలో యుడిసిగా ఉద్యోగజీవితం ఆరంభించి, కొన్నాళ్ళ అధ్యాపకునిగా పనిచేసి ఆ తర్వాత రాజకీయరంగంలోకి ప్రవేశించి భారత రాజకీయాల్లో విశిష్ట నాయకునిగా ఎదిగి, పలు మంత్రిపదవుల్లో రాణించి అచిరకాలంలోనే అత్యు న్నతమైన రాష్ట్రపతి పదవిని కూడా అధిష్టించారంటే.. సామాన్యునిగా జన్మించినా అసామాన్యునిగా రాణించారంటే.. ప్రణబ్ జీవితం వెనుక ఎంతటి కఠోరమైన శ్రమ, ఎంతటి కృషి ఉందో ఆయనలో ఎంతటి మేధాసంపత్తి ఉందో అర్థమవుతుంది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, నాబార్డ్ ఏర్పాటులో ఆయనదే కీలకపాత్ర. యుపిఏ హయాంలో అనేక పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదే. సమాచార హక్కు, ఉపాధి కల్పన, ఇంధన భద్రత, మెట్రో రైలు, ఆధార్‌కార్డుల ఏర్పాటు వంటి అనేక సంచలనాత్మకమైన, ప్రజాస్వామ్యయుతమైన, ప్రజా ప్రయోజనాత్మకమైన నిర్ణయాల్లో ఆయన పాత్ర ఏనాటికీ విస్మరించలేనిది. తన విశేషమైన పాలనా దక్షతతో పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజల మనసులను చూరగొన్నారు.

1969లో రాజ్యసభ సభ్యునిగా రాజకీయప్రస్థానం ప్రారంభించిన ప్రణబ్‌ముఖర్జీ, 1973లోనే కేంద్రమంత్రి మండలిలో స్థానం సాధించారు. అప్పట్లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆయన్ను రాజ్యసభకు పంపారు. ఆమెకు ఎంతో విశ్వాసపాత్రునిగా ఉంటూ 1973లో ఇందిరాగాంధీ మంత్రివర్గంలో ప్రణబ్ స్థానం సంపాదించుకున్నారు. అప్పట్లో ఆమెకు అత్యంత నమ్మకస్తునిగా, కాంగ్రెస్‌లో కీలకనేతగా ఉండేవారు. ఎంతోకాలం ఆయనే కాంగ్రెస్‌కు పెద్దదిక్కుగా కూడా ఉండేవారు. ఆ తర్వాత కేంద్రంలో వివిధ మంత్రి పదవులను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించారు. 12సార్లు కేంద్రంలో మంత్రిపదవులను నిర్వహించి విశేషమైన ప్రతిభతో రాణించి తనకు తనే సాటి అనిపించుకున్నారు. ఆయన ఏ పదవిలో ఉన్నా తన అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలతో, సాటిలేని అంకితభావంతో పనిచేస్తూ ఆ పదవులకే వన్నె తెచ్చారు. 2012లో భారత ప్రథమ పౌరునిగా.. 13వ రాష్ట్రపతిగా అత్యున్నత పదవినధిష్టించి ఆ తర్వాత పదవీ విరమణ గావించేవరకు అహర్నిశలు దేశాభ్యున్నతికే కృషిచేశారు. ఇందిరాగాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి రాజకీయ ఉద్దండుల ప్రశంసలను కూడా ఆయన అందుకున్నారంటే ఆయనెంత ప్రతిభావంతంగా రాజకీయాల్లో రాణించేవారో అవగతమవుతుంది. నేటి భారతప్రధాని నరేంద్రమోడీ కూడా ఆయన పట్ల ఎంతో గౌరవభావం చూపేవారు. వీరిరువురి మధ్య ఎనలేని ఆత్మీయాభిమానాలుండేవి. 1997లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు నందుకున్న ప్రణబ్ ముఖర్జీ ఆ తర్వాత 2008లో ఎంతో ఘనమైన 'పద్మవిభూషణ్' పురస్కారం అందుకున్నారు. 2019 జనవరిలో ఆయన్ను అత్యంత ప్రతిష్ఠాత్మకమైన..ఎంతో విశిష్టమైన భారతరత్న పురస్కారం వరించింది. ప్రపంచంలోనే అత్యుత్తమమైన ఆర్థికమంత్రిగా కూడా ప్రణబ్ విఖ్యాతిని పొందారు. ఆయన మృతి బాధాకరం.

"పార్లమెంట్ భవనం ప్రజాస్వామ్య దేవాలయం. నా పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం. పార్లమెంట్ నా దేవాలయం.. ప్రజాసేవే నా అభిరుచి".. అంటూ ప్రకటించిన మహర్షి.. రాజర్షి.. ప్రణబ్ ముఖర్జీ.. ఇక లేకపోవడం దేశానికి పెద్ద లోటు.

దేశం గర్వించదగిన జాతిరత్నం ప్రణబ్ ముఖర్జీ. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శం. తరతరాలకు మార్గదర్శకం.. భారతావనికే గర్వకారణంగా నిలిచి, జీవితాంతం దేశానికి అద్వితీయమైన సేవలందించిన ఆ మహోన్నత నాయకునికి... ఆ మహనీయునికివే ప్రణామాలు!..

## ప్రణబ్‌జీకి ప్రణామాలు



రాజనీతికోవిదుడు, అపర చాణక్యుడు.. నిష్కళంక నాయకుడు.. దేశరాజకీయాల్లో తనదంటూ ఒక విశిష్టమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న మహోన్నత వ్యక్తి.. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అస్తమయంతో దేశం శోకతప్తమైంది. సామాన్యునిగా జీవిత ప్రస్థానం ప్రారంభించి అసామాన్యునిగా ఎదిగిన మహానేత ఆయన. అసాధారణ ప్రజ్ఞాపాటవాలతో రాణించి భరతమాత ముద్దుబిడ్డగా, 'భారతరత్న'గా భాసిస్తూ దేశానికి చిరస్మరణీయమైన సేవలందించారు. ఆయన జీవితం ఆదర్శవంతం..భావితరాలకు మార్గదర్శకం. అందరికీ స్ఫూర్తిదాయకం.

---

## నష్టపోయిన రైతులకు
## పరిహారం ఇవ్వాలి

**- బిజెపి నాయకుని వినతి**

ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బిజెపి నాయకుడు కె.బ్రహ్మానందం అన్నారు. గతనెల 31న ఆయన రైతులతో, స్థానిక బిజెపినాయకులతో కలిసి కావలిలోని తన నివాసంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కావలి ఆర్డీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అకాల వర్షాలకు అనేక ప్రాంతాల్లో వరి, వేరుశనగ, పత్తి, మినుము, పెసర తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయని, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి రైతులకు సాయం అందించాలని కోరారు. అదేవిధంగా ధాన్యం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. దళారుల దెబ్బతో రైతులు అనేక విధాలుగా నష్టపోతున్నారని, ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా వుందని మాయమాటలు చెప్పి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని, అధికారులు ఈ అన్యాయాన్ని అరికట్టి అన్నదాతలకు న్యాయం చేయాలని ఆయన కోరారు. రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రైతు నాయకుడు ముంగమూరు వెంకటరెడ్డి, ప్రతాప్ రెడ్డి, కొండా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ కుట్రకి బలైపోయిన జివికె ...!




'రాజు తల్చుకుంటే..!' అన్న సామెతను ఇప్పుడు నిజం చేసింది మోడీ ప్రభుత్వం. శక్తివంతమైన అదానీల పరపతి ముందు, అంతర్జాతీయ ఖ్యాతి కలిగిన జివికె అయినా బలాదూరే అన్న స్థాయిలో తమ సత్తా చూపించారు అదానీలు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ముంబై విమానాశ్రయాన్ని తమ చేతికి చిక్కించుకోవడంలో అదాని సఫలమయ్యింది. మోసపూరితమైన కార్పొరేట్ కుట్రకి జి వి కె సంస్థ బలైపోయింది. ఈ ఎయిర్‌పోర్టులో ఎక్కువ వాటా కొనుగోలు చేసి తమ చేజిక్కించుకోవాలని గతంలో అదానీలు చేసిన ప్రయత్నాన్ని జివికె అడ్డుకోవడంతో అదానీ అహం దెబ్బతింది. అంతే.. తనదైన శైలిలో పావులు కదిపి కేంద్ర ప్రభుత్వ పెద్దల అండతో ఈ.డి, ఐటి శాఖలను జివికెపై ప్రయోగించి 700 కోట్ల మేరకు నిధులు తప్పుద్రోవ పట్టించారనే ఆరోపణలు చేసి కేసులు పెట్టారు. లేనిపోని తలనొప్పులు తమకెందుకనుకున్న జివికె సంస్థ ఇప్పుడు ఆదానీలకు లొంగిపోయింది. ముంబై విమానాశ్రయాన్ని ఆదానీలకే అప్పచెప్పనున్నట్లు ప్రకటించింది. అధికారం మనదైతే, పాలక పక్షం మనవాళ్ళైతే ఎంతటి వాళ్ళనైనా వంగదీయవచ్చు, లొంగదీసుకోవచ్చు అనడానికి ఈ సంఘటన పెద్ద ఉదాహరణగా ఇప్పుడు కార్పొరేట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉత్తర భారత దేశంలో దక్షిణాది సంస్థలను ఎదగనీయరనడానికి కూడా ఇదొక పెద్ద ఉదాహరణ. ప్రపంచ స్థాయి ప్రఖ్యాతి చెందిన ముంబై ఎయిర్పోర్టు ఇప్పుడు మన నెల్లూరీయుల చేతి నుండి జారిపోయింది.. కాదు.. కాదు లాక్కున్నారు. దౌర్జన్యం వర్ధిల్లింది. ధర్మంపై అధర్మం గెలిచింది. నెల్లూరీయులుగా మనమందరం ఈ దురాగతాన్ని ఖండిద్దాం.

**పి. హరికుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట.**

## ఆనం వాళ్ళు ఎందులో గొప్ప..?

నగరంలో ప్రభుత్వ భవనాలకు, వీధులకు, సెంటర్లకు స్టేడియంలకు, చివరికి వైద్య కళాశాలకు సైతం ఏసి సుబ్బారెడ్డి పేరు పెట్టడాన్ని పబ్లిక్ డిమాండ్‌గా 'సంచారి' నిలదీయడం హర్షణీయం. ఆనం వారి జమానాలో మునిసిపాలిటీలో కొంతమందికి ఉద్యోగాలు ఇప్పించారు తప్ప ప్రజలకు ఉపయోగపడే భారీ ప్రాజెక్టులు సాధించడం గాని, పరిశ్రమలు రప్పించడం గాని చేయలేదు సరికదా, చెప్పుకోదగ్గ స్థాయిలో వారు చేసిన ఘనకార్యాలు కూడా పెద్దగా లేవు. తమకున్న రాజకీయ పలుకుబడితో నగరంపై పెత్తనం చెలాయించి తమ ఇష్టానుసారం వ్యవహరించారు తప్ప ప్రజలకోసం వీళ్ళు చేసిన దానాలు గాని, త్యాగాలుగాని మచ్చుకైనా లేవు. మెడికల్ కాలేజీకి ఏసి సుబ్బారెడ్డి పేరు పెట్టడం నిజంగా స్థల దాతలను అవమానించినట్లే. సొమ్మొకడిది సోకొకడిది అన్న తీరులో ఆనమోళ్ళు ఇన్నాళ్లూ వ్యవహరించారు. 'సంచారి' చెప్పినట్లుగా కొత్తతరం నాయకులన్నా మేలుకుని ఆనం సోదరులు చేసిన తప్పులను సరిదిద్దాలి. విశ్వవిద్యాలయానికి కూడా మహాకవి తిక్కన పేరు పెట్టమనడం కూడా మంచి సూచన. ఇది ఏ ఒక్కరి అభిప్రాయమో కాదు నెల్లూరు ప్రజల మనోగతం. టిఆర్‌పి రేట్ల కోసమో రోజువారీ సేల్స్ కోసమో తపించే చానళ్ళు, దినపత్రికలు చేయలేని సాహసాలను చేస్తున్న 'లాయర్'కు అభినందనలు.

**యం. రఘురామిరెడ్డి,**
**రిటైర్డ్ ఇంజనీర్, నెల్లూరు.**

## చైనాని నమ్మకూడదు

కరోనా వంటి భయంకర వైరస్ ద్వారా బయో యుద్ధానికి పన్నాగం పన్నిన దుష్ట దేశం చైనా. ఇలాంటి దుర్మార్గపు ఆలోచన చేసిన దేశాన్ని మనం అస్సలు నమ్మకూడదు. సరిహద్దులో తమ సైన్యాన్ని మోహరింపచేసి మనల్ని కవ్వించి తోక ముడిచి నట్లే ముడిచి, కొంత సమయాన్నిచ్చి మళ్ళీ ఇప్పుడు వివాదం వున్న పాంగాంగ్ ఉత్తర తీరాన్ని వదిలిపెట్టి, ఏ వివాదమూ లేని దక్షిణ తీరంలో సైన్యాన్ని మోహరించి అర్ధ రాత్రి దొంగదెబ్బ కొట్టే ప్రయత్నం చేసిందంటే చైనా బుద్ధి ఎలాంటిదో అర్థమైపోతుంది. కరోనా మహమ్మారి చేస్తున్న విలయ తాండవంతో ప్రపంచంలోని అనేక దేశాలతోపాటు భారతదేశం కూడా విలవిలలాడి పోతున్న తరుణంలో చైనా చేస్తున్న కవ్వింపు చర్యలు, ఆ దేశపు ఆలోచనలు ఎంతటి నీచాతి నీచమైనవో వేరే చెప్పనక్కర్లేదు. ఇలాంటి తరుణంలో మనం ప్రతిక్షణం అప్రమత్తతతో ఉండడం చాలా అవసరం. తస్మాత్ జాగ్రత్త....!

**బి. లక్ష్మీధర్, బెల్గామ్, కర్ణాటక.**


లాయర్

పాఠకులకు మనవి

మా(మీ) లాయర్ పత్రికకు

**సమాచారం / లేఖలు**

పంపదలచిన వారు

**9866314741** నంబరుకు

వాట్సప్ ద్వారా గాని, లేదా

roopagroup@yahoo.com కి

ఈ-మెయిల్ ద్వారా గాని

పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :

ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,

మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-



# ఇక.. రైతుల అకౌంట్లలోకే కరెంటు డబ్బులు

## అన్నదాతలకు ముఖ్యమంత్రి మరో వరం

ఉచిత విద్యుత్‌లో పెద్ద సవరణ తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వ సవరణల్లో భాగంగా తెచ్చిన ఈ సవరణ వల్ల ఇకపై ఉచిత విద్యుత్ స్థానంలో రైతులు వాడే వినియోగానికి ప్రభుత్వమే రైతులకు నగదు బదిలీ చేస్తుంది. ఆ డబ్బును రైతులే విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించాలి. రైతులకు దీనివల్ల ఇబ్బందేమీ ఉండదు. కానీ ఇలా చేయడం వల్ల, పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడం వల్ల ఎంత వాడుతున్నామో రైతులకు తెలుస్తుంది, అలాగే విద్యుత్ సరఫరా, వినియోగంలో వృధాని నివారించి భారీగా ఆదా చేయొచ్చన్నది ప్రభుత్వాల లక్ష్యం. దీనికి సంబంధించి వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించడంతోపాటు రైతులకు నగదు బదిలీ విధానంలో బిల్లులు చెల్లించాలనే ప్రతిపాదనలకు ఏపీ మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది.

### ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు

రైతులకు విద్యుత్ నగదు బదిలీ పథకాన్ని ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేయనున్నట్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కేబినెట్ సమావేశంలో వెల్లడించారు. రైతుకు అందే విద్యుత్ ఎప్పటికీ ఉచితమేనని ఆయన అన్నారు. "ఒక్క కనెక్షన్ తొలగించబోము, ఉన్న కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తాం. విద్యుత్ కనెక్షన్ ఉన్న రైతు పేరుమీద ప్రత్యేక ఖాతా తెరుస్తాం. మీటర్ల ఖర్చు డిస్కమ్‌లు, ప్రభుత్వాలే భరిస్తాయి. ప్రభుత్వం తమ ఖాతాల్లో జమ చేసే డబ్బులుని రైతులే డిస్కమ్‌లకు చెల్లిస్తారు" అని సీఎం స్పష్టంగా వివరించారు.

అలాగే రాబోయే ముప్పై ఏళ్ల వరకు ఉచిత విద్యుత్‌కి ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత ఉచిత విద్యుత్ కోసం 10వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పథకం రూపొందించామని, దాన్ని తీర్చిదిద్దుతామని సీఎం చెప్పారు. వచ్చే 30-35 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ పథకానికి ఢోకాలేదన్నారు. పగటిపూట 9 గంటల విద్యుత్ రాకపోతే రైతులు నిలదీయవచ్చన్నారు. రైతులకు ఎవరికైనా పథకం వర్తించపోతే క్రమబద్ధీకరిస్తామని సీఎం స్పష్టం చేశారు.

రైతుకు అందే విద్యుత్తు ఎప్పటికీ ఉచితమేనని, ఒక్క కనెక్షన్ కూడా తొలగించబోమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల వల్ల రైతుపై ఒక్కపైసా భారం కూడా పడదని హామీ ఇచ్చారు.

చంద్రబాబు ఉచిత విద్యుత్తు సాధ్యం కాదన్నారు. కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవడమేనని ఎద్దేవా చేశారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుది. సుమారు 8వేల కోట్ల మేర ఉచిత విద్యుత్తు బకాయిలు పెట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలు తీర్చాం. రూ.1700 కోట్లతో ఫీడర్లను అప్‌గ్రేడ్ చేశాం. నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. పగటిపూట 9 గంటల కరెంటు, ఇప్పటికే 89శాతం ఫీడర్లలో అమలవుతోంది. రబీ సీజన్ నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది. 10వేల మెగావాట్ల సోలార్‌తో పథకాన్ని మరింత గొప్పగా దీర్చిదిద్దుతాం. ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా ప్రణాళికలు రచిస్తున్నాం. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ ఒక్క వైఎస్సార్‌కే ఉంది. అందుకే పథకానికి ఆయన పేరు" అని ఈ సందర్భంగా సీఎం జగన్ తెలిపారు.

---

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువెళ్తే మిల్లర్లు ఆ ధాన్యంలో తేమశాతం ఉందని, గింజ విరుగుడు ఉంటుందని చెప్తూ పుట్టి ధాన్యానికి అదనంగా 250 కేజీల దాకా ఇవ్వాలని చెప్తున్నారు. కొనుగోలు కేంద్రాల దాకా వెళ్ళకుండా దళారులకే అమ్మితే పుట్టి రూ.10వేలకు మించి ఇవ్వడం లేదు. అటు గిట్టుబాటు ధర రాక, ఇటు పండిన కష్టమంతా తక్కువ ధరకే అమ్ముకోలేక, మరోవైపు వర్షాలు వస్తే ధాన్యం తడిసి పోతుందేమోననే ఆందోళనతో కంటికి నిదురే రాక.. జిల్లాలో వరి రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ప్రభుత్వం ఎంతగా రైతులకు సహాయపడుతూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా, గిట్టుబాటు ధర ఇప్పించేందుకు అధికారులంతా కృషిచేస్తున్నా చివరికి..ఆచరణకు వచ్చేసరికి దళారీలదే రాజ్యమవుతోంది.



## 'గిట్టుబాటు' లేని సేద్యం..

# దళారులదే రాజ్యం

- తక్కువ ధరకే ధాన్యం కొనుగోళ్ళు
- రైతుల్ని నిలువుదోపిడీ చేస్తున్న మిల్లర్లు
- కన్నీళ్ళు పెట్టుకుంటున్న అన్నదాతలు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. సోమశిల జలాశయం కింద ఈ ఎడగారు సీజన్‌లో రెండోపంటగా సుమారు 4 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి సాగునీరు పుష్కలంగా లభించడంతో పంటలు కూడా ఏపుగా ఎదిగాయి. డెల్టా, నాన్‌డెల్టా అనే తేడా లేకుండా జిల్లాలోని అనేకప్రాంతాల్లో రైతులు వరి పంటను బాగానే సాగుచేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే మంచి దిగుబడులు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కానీ, మిల్లర్ల మాయాజాలం, దళారీల దోపిడీతో రైతులు మళ్ళీ నష్టాల బాట పడుతున్నారు. పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు విక్రయించుకునేందుకు గ్రామాల్లో సరైన సదుపాయాలు లేక వేలాదిమంది రైతులు అల్లాడిపోతున్నారు. ఒకవైపు వరి కోతలు జరుగుతూనే ఉన్నాయి. కల్లాల్లోకి ధాన్యం రాశులు చేరుకుంటున్నాయి. మరోపక్క అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో కోసిన ధాన్యం తడిసిపోతూ నాణ్యత కోల్పోతుండడంతో మంచి ధర రాదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఖర్చులు బోలెడు..
### ఆదాయం చారెడు :

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్నా చివరికి ఏదో ఒక సమస్య అన్నదాతలను చుట్టుముడుతూనే ఉంది. పంటలు పండించడం ఒకపెద్ద శ్రమ అయితే వాటిని అమ్ముకునేందుకు ఎక్కడెక్కడి పొలాల్లో నుంచో కిలోమీటర్ల దూరం తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించాలంటే సమయానికి కూలీలు దొరక్క, ఇతర సమస్యలతో రైతులు నానా యాతనలు పడుతున్నారు. కోత కోసి ధాన్యం బస్తాల్లోకి ఎక్కించినా, ఆ ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు కల్లాలు లేకపోవడంతో వాటిని తీసుకువచ్చి రోడ్లమీదనే ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. దీనికితోడు వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు పట్టలు పరచి, రేయింబవళ్ళు వాటివద్దనే కాపలా ఉండాల్సివస్తోంది. ఈ బాధలతో పాటు, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు అవసరమైనన్ని గోతాలు కొనుక్కుని పొలాల్లోనుంచి ఆ ధాన్యాన్ని తీసుకుని వచ్చేందుకు వాహనాలు సమకూర్చుకుని రావాలంటే అదనపు శ్రమతో పాటు ఆ ఖర్చులన్నీ కలిసి రైతులకు తడిసి మోపెడవుతున్నాయి. ఇంతచేసి వాటిని కొనుగోలు కేంద్రాలకు ఏదోఒకవిధంగా కష్టపడి తీసుకువచ్చినా, అక్కడ రకరకాల నిబంధనలు రైతులను నిరాశకు గురిచేస్తున్నాయి. తేమశాతం ఎక్కువగా ఉందని, తాలు.. తరుగు పోతుందంటూ ఒక తూము (42.5 కేజీలు)కు నాలుగున్నర కేజీలవంతున అదనంగా తీసుకుంటున్నారని అనేకమంది రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు ఎంత కష్టపడి సేద్యం చేసినా ఎకరాకు మిగిలేది అయిదువేల రూపాయలకంటే ఎక్కువుండదు. అదికాస్తా దళారుల పాలవుతోంది. ఎంత కష్టపడి పంటలు పండినా చివరికి ఈ ఇబ్బందులన్నీ భరించలేక రైతులు తక్కువ ధరకే పంటను తెగనమ్ముకునే దుస్థితి దాపురిస్తోంది.

### మిల్లర్ల మాయాజాలం..
### దళారుల దోపిడీ :

ప్రభుత్వం పుట్టి(850కేజీలు)కి ఏ-గ్రేడ్ ధాన్యానికి 15,597-50 రూపాయలు మద్దతుధరగా ప్రకటించింది. జిల్లాలో ధాన్యం అధికంగా పండే 32 మండలాల్లో 83 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతులు మోసపోకుండా దళారుల బారిన పడకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లన్నీ చేస్తుండడం సంతోషకరమే అయినా, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను తట్టుకునే పరిస్థితి లేక రైతులు మళ్ళీ దళారుల బారినే పడుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల సంఖ్య ఆశించినస్థాయిలో లేకపోవడంతో కొనుగోళ్ళు మందగించాయి. ఈ కేంద్రాల నుంచి సుమారు 2 లక్షల టన్నుల దాకా ధాన్యం కొనుగోలు చేయాల్సివుండగా, ఇప్పటిదాకా సుమారు 10వేల టన్నుల దాకా కూడా కొనుగోళ్ళు కాలేదని సమాచారం. ఇందుకు ప్రధాన కారణం రైతులను మధ్యలోనే మిల్లర్లు, దళారులు మాయజేసి నిలువుదోపిడీ చేస్తుండడమేనని వేరే చెప్పనక్కరలేదు. మిల్లర్లు ఒక మాఫియాగా ఏర్పడి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద దళారులను మోహరించి రైతులు అక్కడకు రాకుండానే మాయమాటలు చెప్పి ధాన్యాన్ని తక్కువ ధరకే కొనుగోలు చేసుకుంటున్నారని, ఏ-గ్రేడ్ ధాన్యాన్ని మిల్లర్లు పుట్టి 10వేలలోపే ఇచ్చి ధాన్యాన్ని అతి తక్కువ ధరకు కొనేస్తున్నారని తెలుస్తోంది. తేమశాతం ఎక్కువగా ఉంది కనుక ఒకవేళ కొనుగోలు కేంద్రాల వద్దకు శ్రమపడి వెళ్ళినా అంత ధర రాదనిచెప్పి ధాన్యాన్ని ఎక్కువగా మిల్లర్ల దళారులే కొంటుండడం దారుణం. అందుకు తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాల్లో కూడా తేమశాతం ఎక్కువగా ఉందని చెప్తుండడంతో ఏం చెయ్యాలో పాలుపోక రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేక రోడ్లమీదనే ఆరబెట్టుకుంటుండడంతో వర్షానికి తడిసి.. చివరికి ఆ ధాన్యం అమ్ముకోగలమో లేమో అనే సందేహంతో పుట్టికి దాదాపు ఆరువేల రూపాయల దాకా దళారులు తగ్గించేస్తున్నా ఇక చేసేదేమీ లేక అనేకమంది రైతులు అయిన కాడికి ఆ ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నారు.

### కష్టాలు నష్టాలు.. కన్నీళ్ళే మిగులుతున్నాయి :

ప్రైవేట్ మిల్లర్ల వాళ్ళు ధాన్యం తీసుకోవడంతోనే రైతులకు డబ్బులు ఇచ్చేస్తుండడం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మినా డబ్బు వచ్చేందుకు చెక్కుల రావాలంటూ నెల రోజులకు పైగానే జాప్యం అవుతుండడంతో చాలామంది రైతులు ఈ కష్టాలను భరించలేక వచ్చినకాడికి చాల్లే అనుకుంటూ.. విధిలేని పరిస్థితుల్లో చివరికి ప్రైవేట్ మిల్లర్లకు, దళారులకు ధాన్యం అమ్మేసుకుంటున్నారు. దీంతో రైతులకు ఈసారి కూడా కష్టాలు నష్టాలతో కన్నీళ్ళే మిగులుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ఏమైనా సమస్య ఉంటే చెప్పాలంటూ తాజాగా ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులు చేసేందుకు కూడా అనేకమంది రైతులు సుముఖంగా లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు పడుతున్న ఈ అవస్థలన్నీ గమనించి రైతులు పండించిన పొలాల వద్దనే మిల్లర్లు ప్రభుత్వం సూచించిన మద్దతు ధర తప్పనిసరిగా ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసే ఏర్పాట్లు చేయడమో లేక ప్రభుత్వమే నేరుగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయడమో చేయాలి. ఈ కొనుగోళ్ళ వ్యవహారంలో మధ్యలో ఎక్కడా మిల్లర్లు, దళారుల జోక్యం లేకుండా చూడాలి. అప్పటికి గానీ అన్నదాతల అవస్థలు ఒక కొలిక్కి వచ్చేలా లేవు.

# నెల్లూరు కబుర్లు

### బారాషహీద్ దర్గాలో..

## నేత్రపర్వంగా గంధమహోత్సవం

**కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సంప్రదాయబద్ధంగా వేడుక**



నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో గతనెల 31న రొట్టెల పండుగలో ప్రధానఘట్టమైన గంధమహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కరోనా నేపథ్యంలో నిబంధనల మేరకు పరిమిత సంఖ్యలో అతి కొద్దిమంది ముస్లిం మత పెద్దల పర్యవేక్షణలో ఈ వేడుకను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కోవిడ్ ఆంక్షల నేపథ్యంలో ఈ ఏడాది రొట్టెల పండుగను నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే, మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి సంప్రదాయబద్ధంగా నగరంలోని కోటమిట్ట అమీనియా మసీదులో 12 బిందెల్లో గంధాన్ని కలిపి, పకీర్లు గీతాలాపన చేస్తుండగా మేళతాళాలతో ఆ గంధం బిందెలను మతపెద్దలు తలపై పెట్టుకుని బారాషహీద్ దర్గా వద్దకు చేరుకున్నారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సైనీ చేతులమీదుగా దర్గాలోని అమరవీరుల మహజర్లకు గంధలేపనం చేశారు. పరిమిత సంఖ్యలో మతపెద్దలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనల తర్వాత అక్కడున్న అతి కొద్దిమంది భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌బాషా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **14 నుంచి పీజీ, 16 నుంచి డిగ్రీ పరీక్షలు**
- **విఎస్‌యు వీసీ వెల్లడి**

జిల్లాలో సెప్టెంబరు 14 నుంచి పీజీ పరీక్షలు, 16 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని విఎస్‌యు వీసీ ఆర్ సుదర్శనరావు చెప్పారు. గతనెల 31న ఆయన విఎస్‌యులో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలు తెలిపారు. జిల్లాలో డిగ్రీ చివరి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు రాసే విద్యార్థులు 8778 మంది ఉన్నారని, పరీక్షల నిర్వహణ కోసం 45 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు, యుజిసి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం పరీక్షలను నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి విద్యార్థి మాస్కు, గ్లౌజులు ధరించాలని, కోవిడ్ నిబంధనలు పాటించి భౌతికదూరం పాటిస్తూ పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కరోనా వైరస్ బారినపడి పరీక్షలు రాయలేని విద్యార్థులకు మరోసారి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పీజీ పరీక్షలు విశ్వవిద్యాలయం, కావలి పీజీ సెంటర్‌లలో కోర్సులు చదివే వారికి మాత్రమే ఉంటాయని, మిగిలిన విద్యార్థులకు తర్వాత నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయ్యాయని, ప్రస్తుతం థియరీ పరీక్షలు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డా.సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్ల ఆందోళన

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలకు ఎంసిఐ గుర్తింపు కావాలంటూ గతనెల 30న జూనియర్ డాక్టర్లు కళాశాల ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేశారు. కళాశాల ఏర్పడి ఆరేళ్లవుతున్నా భారతీయ వైద్యమండలి గుర్తింపు లేకపోవడం విచారకరమని, సరైన గుర్తింపు లేకపోవడంతో విద్యార్థులు పీజీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు తనూజ్‌తో పాటు మణిచంద్ర, సాయిభరత్, మనోజ్ తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది.



## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**- మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**

అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. గతనెల 31న ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిపై డిఆర్ఓ ఎంవి రమణ, ఆర్డీఓ ఉమాదేవి తదితర అధికారులు, మండల అధికారులతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలుతీరును సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, వ్యవసాయానికి పగటిపూట నిర్ణీతవేళల్లో విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ళ స్థలాల విషయంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

## విశ్రాంత ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం



జిల్లా పోలీసుశాఖలో పనిచేసి గతనెల 31న ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలు జి.దయాకర్, ఎన్ తిరుమలరాజు, ఏఆర్ ఎస్ఐ ఎస్‌కె ఖాజావలి, సీనియర్ అసిస్టెంట్ బి.వెంకయ్యలకు అదేరోజున నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులను తన తల్లిదండ్రులుగా భావిస్తానని, తమదంతా ఒకే కుటుంబమని అన్నారు. ఉద్యోగ విరమణరోజునే పోలీసు శాఖ నుంచి వారికి వచ్చే బెనిఫిట్స్‌ను అందించడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. ట్రైనీ ఐపిఎస్ అధికారి కె.మహేశ్వర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్ వీరభద్రుడు, పోలీసు అధికారుల సంఘం నాయకులు మద్దిపాటి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

## రంగనాథస్వామికి పవిత్రోత్సవాలు

నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా గతనెల 30న ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. తొలుత స్వామివారిని శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం పవిత్రాలను ప్రతిష్టించి, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, తిరుమంజనం, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాథాచార్యుల నేతృత్వంలో, ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో స్వామివారికి ఈ కైంకర్యం జరిగింది. కరోనా నేపథ్యంలో నిబంధనలు పాటిస్తూ అర్చకులు ఈ వేడుక నిర్వహించారు.

## ప్లాస్మా దానం చేసిన బయ్యా

శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు వైస్ గవర్నర్ బయ్యా రవికుమార్ నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గతనెల 31న ప్లాస్మా దానం చేశారు. ప్లాస్మా దానానికి లయన్స్‌క్లబ్ సభ్యులు ముందుకు రావాలని, కరోనా బాధితులకు ప్రాణదానం చేయాలని బయ్యా ఈ సందర్భంగా కోరారు.

## కరోనా కాల్‌సెంటర్

కరోనాకు సంబంధించి ఎలాంటి సమాచారం కోసమైనా కాల్‌సెంటర్ నంబరు 104, 1077 లను వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని జడ్పీ ఆవరణంలోని ఎమర్జన్సీ కేంద్రంలో ఏర్పాటుచేసిన కాల్‌సెంటర్ నంబర్లు నిత్యం పనిచేస్తాయని చెప్పారు.

## 20 నుంచి సచివాలయ పరీక్షలు



సెప్టెంబర్ 20 నుంచి 26వ తేది వరకు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. గతనెల 31న ఆయన నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై పరీక్షల ఏర్పాట్లను చర్చించి తగు సూచనలు చేశారు. జిల్లాలో దాదాపు 54 వేల మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, అధికారులు పటిష్టమైన ఏర్పాట్లమధ్య ఈ పరీక్షలు జరపాలని, కోవిడ్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అభ్యర్థులు మాస్కులు ధరించి పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకునేలా చూడాలని, థర్మల్ స్క్రీనింగ్ జరిపిన తర్వాతే లోపలికి అనుమతించాలని, ఇన్విజిలేటర్లు మాస్కులు ధరించి ఒక్కో బెంచ్‌కి ఒక్కో అభ్యర్థిని మాత్రమే అనుమతించాలని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## 8వ తేదీ దాకా లాక్‌డౌన్ పొడిగింపు

కరోనా కట్టడిలో భాగంగా ఈనెల 8వ తేది వరకు లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు గతనెల 31న ఉత్తర్వులిచ్చారు. దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, నిత్యావసర సరుకుల దుకాణాలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే ఉంటాయన్నారు. వ్యాపారులంతా స్వచ్ఛంధంగా కరోనా నియంత్రణకు సహకరిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, మాస్కులు ధరించి భౌతికదూరం పాటిస్తుండాలని, కరోనా నియంత్రణకు ప్రభుత్వం పేర్కొన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ కోరారు.

## నివారణ చర్యలు వేగవంతం చేయండి

**- అధికారులతో జేసీ ప్రభాకర్‌రెడ్డి**

జిల్లాలో విజృంభిస్తున్న కరోనా వ్యాధిని నియంత్రించేందుకు అధికారులు వేగవంతంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. గతనెల 31న ఆయన కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పిహెచ్‌సి అధికారులు, పారామెడికల్ సిబ్బంది, నోడల్ అధికారులు అందరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ కోవిడ్ వైరస్‌ను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఆర్.స్వర్ణలత, ఉమామహేశ్వరి, రమాదేవి, సతీష్, సుధీర్ పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదు

**- కార్పొరేషన్ ఆరోగ్యాధికారి వెంకటరమణ**

పారిశుద్ధ్యం పనుల్లో ఎలాంటి అలక్ష్యం ప్రదర్శించినా చర్యలు తప్పవని నగర కార్పొరేషన్ ఆరోగ్య అధికారి వెంకటరమణ శానిటరీ ఇన్స్‌పెక్టర్లను హెచ్చరించారు. గతనెల 31న ఆయన నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో పారిశుద్ధ్య అధికారులు, సిబ్బందితో సమావేశమై ఇంటింటి చెత్తసేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం పనికిరాదన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్యం పనుల ఫోటోలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుద్యం పనుల్లో నిర్లక్ష్యం వహించిన శానిటరీ ఇన్స్‌పెక్టర్లు మల్లి, ప్రభాకర్‌లకు, మరో ఇద్దరు సచివాలయ శానిటరీ కార్యదర్శులకు ఆయన ఈ సందర్భంగా మెమోలు జారీ చేశారు.

### 'సత్య' సహకారంతో..

## జయభారత్ ఆసుపత్రికి పిపిఇ కిట్‌లు

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి బిజెపి జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ సహకారంతో గతనెల 31న స్థానిక బిజెపి నాయకులు 300 పిపిఇ కిట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి నాయకుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ మాట్లాడుతూ సత్యకుమార్ చిన్నతనం నుంచి నాయకత్వ లక్షణాలతో ఎదిగారని, ఈ జిల్లాతో ఆయనకు దాదాపు పాతికేళ్ల అనుభవం ఉందని, సేవాభావంతో ఆయన చేస్తున్న కార్యక్రమాలు అందరి ప్రశంసలందుకుంటున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, బిజెపి నాయకులు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, రాధాకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కష్టాలు

# అటు కరోనా కాటు.. ఇటు దోమల పోటు

## ➢ బెంబేలెత్తుతున్న జనం.. పట్టించుకోని అధికారగణం



**మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా..అసలే కరోనా కాటు.. మరోవైపు దోమలపోటుతో జిల్లా ప్రజానీకం అల్లాడిపోతోంది. నిత్యం కరోనా బాధితులు పెరిగిపోతుంటే ఇంకోవైపు సీజనల్ వ్యాధులు కూడా కాటేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ కరోనా కష్ట కాలంలో మామూలు జ్వరమో, దగ్గో వచ్చినా అదెక్కడ కరోనాగా మారి ప్రాణాలు తీస్తుందేమోనని ప్రజలు బెంబేలెత్తిపోతుంటే.. ఇప్పుడు వర్షాల సీజన్ కావడంతో సీజన్ వ్యాధులు కూడా తోడై జనానికి నరకం చూపిస్తున్నాయి. వర్షాల వల్ల వాతావరణం చల్లబడిపోవడంతో దోమలు ఇదే సందని వీరవిహారం చేస్తూ లేనిపోని రోగాలు తెస్తున్నాయి.**

జిల్లాలోని పట్టణాలు, గ్రామాలతో పాటు నెల్లూరు నగరంలోనూ ఎక్కడ చూసినా ఎంతోకాలంగా డ్రైనేజీ వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం, వాటిని బాగుచేసే నాధులు కనిపించకపోవడంతో పాటు, మురుగుకాలువల్లో సక్రమంగా పూడిక తీయకపోవడం, రోడ్లు గుంటలు పడి అస్తవ్యస్తంగా ఉండడంతో వాననీళ్ళు, బురదనీళ్ళు, డ్రైనేజీ మురుగునీళ్ళు అన్నీ కలసి వెరసి దోమలకు పుట్టిళ్ళుగా తయారైపోతున్నాయి. దీంతో రకరకాల వ్యాధులు పొంచివున్నాయి. అయినా పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ నెల్లూరు నగరం దోమలకు ప్రసిద్ధి. ఎన్ని రకాల దోమలమందులు వాడినా వాటికి అవి అలవాటుపడి అంతకంతకు బలంగా తయారవడం వాటి ప్రత్యేకత. పగలు రాత్రి అనే తేడా లేకుండా జనాలకు నిద్రలేకుండా కుట్టికుట్టి చంపడమే కాక, లేనిపోని రోగాలు అంటువ్యాధులు అందరికీ అంటుకడుతుంటాయి. ఈ సీజన్‌లో సర్వసాధారణంగా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తుంటాయి. వాటి ప్రాధమిక లక్షణం కూడా మొదట జ్వరంతోనే ఆరంభమవుతుంది కాబట్టి, ఈ కరోనా కాలంలో జ్వరం వస్తే చాలు కరోనా వచ్చేసినట్లే అన్నట్లుగా జనం భయపడిపోతున్నారు. ఒకవేళ చిన్నపాటి జ్వరం వచ్చినా ఆసుపత్రుల్లో ముందు కోవిడ్ పరీక్షలు చేసుకోవాల్సి వస్తుందేమోనని బెంగ. అందుకు తగ్గట్టుగానే కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఇదే సందని ఇలాంటి అమాయక జనాల కోసమే వేయికళ్ళతో ఎదురు చూస్తుంటాయి. చిన్నపాటి అనారోగ్యానికే లేనిపోని పరీక్షలన్నీ చేసేసి వేలకు వేలు గుంజేస్తున్నాయి. అసలే మన జిల్లాలో ఎక్కడ చూసినా మురుగుదిబ్బలు, చెత్తకుప్పలే కనిపిస్తుంటాయి. ముఖ్యంగా గ్రామాల్లో రోడ్లు మోకాటిలోతు గుంటలతో దర్శనమిస్తుంటాయి. అవి లేకుంటే ఆ ఊరిని గుర్తుపట్టలేమని కాబోలు!.. ఈ వానకు ఆ గుంటలన్నీ నీటితో నిండిపోయి, ఆ నీళ్ళన్నీ కొద్దిరోజులకే మురిగిపోయి ఎంచక్కా దోమల నివాసాలుగా మారిపోతుంటాయి. దోమలుంటే వ్యాధులు రాకుండా ఎందుకుంటాయి?..పంచాయతీల్లో అధికారులున్నా ఈ దుస్థితిని పట్టించుకునే తీరిక, ఓపిక వారికుండదు. వారి పనులు వాళ్ళవి. అసలే కరోనా దెబ్బకి హడలి చస్తుంటే మధ్యలో ఈ దోమల పోడొకటి. వీటివల్ల ఏ రోగాలో.. విషజ్వరాలో వస్తే.. ఈ కరోనా కాలంలో తమను చూసేదెవరు నాయనో అని.. ఆందోళన చెందడం ప్రజల వంతైంది.

### నెల్లూరు సోయగం..చెప్పతరమా!..

నెల్లూరు నగరం విషయానికొస్తే ఇది నరకానికి రహదారిగా పేరుపడింది. మురుగుదిబ్బలకు, చెత్తకుప్పలకు పేరుమోసిన జిల్లా ఇది. ఆ పేరు పోగొట్టుకోవడం దానికెప్పుడూ ఇష్టం ఉండదు. పాపం కార్పొరేషన్ పారిశుద్య కార్మికులు మాత్రం ఈ కరోనా కాలంలో కూడా ఎంతో కష్టపడుతూ తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు వీధుల్ని బాగానే శుభ్రం చేస్తున్నా, నిత్యం ఇళ్లవద్దకు వచ్చి చెత్త ఎత్తేస్తున్నా.. వీధుల్లో రోజూ పడుతున్న చెత్త అంతా ఇంతా కాదు. ఎంత ఎత్తేసినా ఇంకా బండ్లకొద్దీ మిగిలే ఉంటుంది. మార్కెట్లు ఉన్న ప్రాంతాల్లోనైతే ఆ చెత్తను ఎత్తడమన్నది అలివయ్యేపని కాదు. ఇకపోతే నగరంలో మురుగు కాలువల పరిస్థితి మాత్రం ఎవరు ఎంతగా గగ్గోలు పెట్టినా ఇప్పుడే కాదు ఎప్పటికీ మారేది కాదు. డ్రైనేజీ వ్యవస్థ ఎప్పుడో కుంటుపడిపోవడంతో వానొస్తే చాలు కొత్తగా కాలువలక్కర్లేదు.. వీధులే మురుగు కాలువలుగా మారిపోతుంటాయి. ఎంతోమంది అధికారులు ఆ దోవల్లోనే వెళ్తున్నా ముక్కులు మూసుకుని వెళ్తుంటారే తప్ప వారు మాత్రం ఏమి చేయగలరు?.. వానొచ్చినప్పుడు నెల్లూరు నడిబొడ్డులో ఉన్న ట్రంకురోడ్డును చూసినా చాలు.. నెల్లూరు నగర సోయగం ఎంత అద్భుతంగా ఉంటుందో కళ్ళకే కాదు కాళ్ళకి కూడా కడుతుంది. ఏమాత్రం ఏమారినా కాలో చెయ్యో మెలికపడక తప్పదు. మురుగుతో పేరుకుపోయి జారుడుబండల్లాంటి నెల్లూరు రోడ్ల మీద నడవాలంటే నెల్లూరు ప్రజలు సర్కస్ కంపెనీల్లో తర్ఫీదు పొందాల్సిందే. ఇక 'పరిసరాల పరిశుభ్రత' అన్నది పనిగట్టుకుని వెతికినా నగరంలో ఎక్కడా కలికానికి కూడా కనిపించే పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా ముక్కులు పగిలే దుర్వాసనతో పాటు దోమలు ఈగలు ప్రబలిపోతుంటాయి. వీటిని నిత్యం పరిశుభ్రం చేసి దోమలను నివారించడమంటే మాటలు కాదు. అందుకే వాటి జోలికెవరూ వెళ్ళరు. మరికొన్ని చోట్ల వీధుల పక్కనెక్కడ చూసినా పిచ్చిమొక్కలు నిండిపోయి ఉంటాయి. వాటిని తొలగించేందుకు ఎవరూ సాహసించరు.. ముళ్లు గుచ్చుకుంటాయని కాదు.. మనకెందుకొచ్చిన తిప్పలని!.. నగరంలో ఉన్న అనేక ఖాళీ స్థలాల్లో ఇవి మరింత ఏపుగా పెరుగుతుంటాయి. దోమలు, కుక్కలు, పందులతో ఈ ఖాళీ స్థలాలు జలదారుగుంటలకంటే ఘోరంగా ఉంటాయి. ఇక రోగాలు రమ్మంటే రావా?.. అనే మాట అందరూ అనుకునేదే!.. వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పెట్టుకుంటే ఇరుగుపొరుగు వారికి దోమల బాధ తప్పించినట్లవుతుంది కదా!.. తద్వారా జనానికి రోగాల బాధ తగ్గించినట్లవుతుంది కదా అనుకోకండి. అంత పుణ్యం మూటగట్టుకోవడానికి ఇక్కడెవరూ సిద్ధంగా లేరు. అయినా, ఈ బాధలన్నీ నెల్లూరు జనానికి కొత్తా ఏంది?..ఇవన్నీ మామూలే కదా!..దోమలు కూడా బతకాలి కదా!.. అని సరిపెట్టుకునేవారే మనూళ్ళో ఎక్కువ. అందుకే నగరానికి, జిల్లాకి ఎంతోకాలంగా ఈ దుస్థితి... ఈ తీరెప్పుడు మారునో కదా!....

## పోలీసులకు శానిటైజర్లు

మనుబోలు పోలీస్‌స్టేషన్లో విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు గతనెల 31న కంటేపల్లికి చెందిన వైకాపా నాయకుడు మేకల పోతయ్య తనవంతు సేవగా 15వేల రూపాయలు విలువజేసే శానిటైర్లు, మాస్కులు, హెడ్‌గార్డులు పంపిణీచేశాడు. కరోనా నేపథ్యంలో పోలీసులు ప్రజలకు చేస్తున్న సేవలను ఆయన కొనియాడాడు. ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొని దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

## రవాణాశాఖలో కరోనా కలవరం

జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని పరిపాలనాధికారికి, హోంగార్డుకు ఇటీవల కరోనా సోకగా, మళ్ళీ తాజాగా నెల్లూరు ఆర్టీఓతో పాటు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌కు, గూడూరులోని మరో ఎంవిఐకి, కావలిలోని రవాణాశాఖ జూనియర్ సహాయకునికి కరోనా సోకినట్లు సమాచారం. దీంతో ఆయా కార్యాలయాల్లోని రవాణా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ కరోనా పరీక్షలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.



గత నెల 31న నెల్లూరులోని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కోవిడ్ నియంత్రణకు చేపడుతున్న చర్యలపై వీరిరువురు చర్చించుకున్నారు.

## వెంకటగిరిలో పరిశుభ్రతా చర్యలు

వెంకటగిరిలో కరోనా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటికే 25 వార్డులు కంటైన్మెంట్ జోన్లుగా ఉన్నాయని, ఈ వార్డుల్లో ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు మునిసిపల్ కమిషనర్ జాలిరెడ్డి. గతనెల 30న ఆయన మునిసిపల్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో పట్టణంలో పెద్దఎత్తున పరిశుభ్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కరోనా వ్యాధి నియంత్రణ చర్యలతో పాటు, పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశామన్నారు. దోమలను అరికట్టేందుకు మురుగుకాలువల్లో దోమల మందును స్ప్రే చేయిస్తున్నామన్నారు. కంటైన్‌మెంట్ వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్, సోడియం హైపోక్లోరైడ్ ద్రావణం స్ప్రే చేయిస్తూ, కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. వెంకటగిరిలో కోవిడ్ పాజిటివ్ కేసులు ఇప్పటిదాకా 433 నమోదయ్యాయని చెప్పారు. కరోనా వ్యాధి నివారణకు ప్రజలు సహకరించాలని, అందరూ మాస్కులు ధరించాలని, స్వీయనియంత్రణ పాటించాలని, భౌతికదూరం పాటిస్తుండాలని, చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలని, ప్రభుత్వం ఈ వ్యాధి నియంత్రణకు తెలియజేస్తున్న నియమనిబంధనలను అందరూ పాటించాలని కోరారు. సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉంది కనుక ప్రజలు మరింత జాగ్రత్తలు తీసుకుంటూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

## కోవిడ్ బాధితులకు బిఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

### ఆత్మకూరు కోవిడ్ సెంటర్‌కు హాట్ అండ్ కోల్డ్‌వాటర్ ఫ్రిజ్‌ల అందజేత

కోవిడ్ బాధితుల సౌకర్యార్థం ఆత్మకూరులోని బిఎస్ఆర్ హాస్పిటల్స్, బిఎస్ఆర్ ట్రస్ట్ అధినేత బొమ్మిరెడ్డి తారక్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు మునిసిపాలిటీలోని టిడ్కో భవనాల్లో ఏర్పాటుచేసిన కోవిడ్ కేర్‌సెంటర్‌లో ఉన్న కరోనా బాధితుల కోసం నాలుగు హాట్, కోల్డ్ వాటర్ ఫ్రిజ్‌లు వితరణగా అందజేశారు. ఆత్మకూరు ఆర్డీఓ ఉమాదేవి, కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఉమాదేవి మాట్లాడుతూ స్వర్గీయ డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి పేరిట ఆయన కుటుంబ సభ్యులు బిఎస్ఆర్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి బాధితులకు సేవలందిస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. తారక్‌నాథరెడ్డి మాట్లాడుతూ తమ తాతగారైన డాక్టర్ సుందరరామిరెడ్డి ఆశయాలను నెరవేర్చేందుకు బిఎస్ఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించామని, ఈ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తమ తల్లిదండ్రులైన బొమ్మిరెడ్డి రవీంద్రనాధ్‌రెడ్డి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ షకీలా, బాబాయి మాజీ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిల సూచనల మేరకు ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా తమవంతు సేవలందిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి మహమ్మద్ సాధిక్‌హుస్సేన్, ట్రాన్స్‌కో కృష్ణారెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, షేక్ నాయబ్‌షరీఫ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైరస్ నియంత్రణ కాకుండా..

## బడులు తెరవడం మంచిది కాదు

**- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల సూచన**

కోవిడ్ వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ఇది నియంత్రణ కాకుండానే పాఠశాలలు తెరవడం మంచిదికాదని పలువురు వక్తలు అన్నారు. గతనెల 30న నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించినందువల్ల బడిపిల్లలకు కరోనా సోకిన దేశాల అనుభవాలను దృష్టిలో పెట్టుకోవాలని వారు ప్రభుత్వానికి సూచించారు. ఇప్పటికే ఆచరిస్తున్న టీవీ, ఇంటర్‌నెట్‌ల ద్వారా జరుగుతున్న విద్యాబోధనలో అందరికీ నెట్ అందుబాటులోకి తీసుకువచ్చి, ల్యాప్‌టాప్, ట్యాబ్ వగైరాలు అందజేసి ఆన్‌లైన్ ద్వారా విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకోవడం సముచితమన్నారు. కరోనా మహమ్మారి వ్యాధి విస్తరిస్తున్న ఈ తరుణంలో పాఠశాలలు ప్రారంభించే విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి రమణయ్య, యుటిఎఫ్ నాయకులు పరంధామయ్య, తులసీరాంబాబు, నవకోటీశ్వరరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బుజ్జయ్య పాల్గొన్నారు.

# అంతర్జాతీయస్థాయి సదుపాయాలతోనే శ్రీసిటీ అభివృద్ధి

**- ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి**

ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతోనే శ్రీసిటీ అభివృద్ధి జరిగిందని, ప్రస్తుతం శ్రీసిటీలో 27 దేశాలకు చెందిన 187 పారిశ్రామిక సంస్థలు పనిచేస్తూ, సుమారు 50వేల మందికి ఉపాధి అవకాశాలు కలిగిస్తున్నాయని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. గతనెల 31న 'మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా అభివృద్ధి సాధించడం-పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను గమ్యంగా చేయడం' అనే అంశంపై కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించిన డిజిటల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రపంచస్థాయి మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. శ్రీసిటీ అభివృద్ధి దశ నుంచి తన అనుభవాలను పంచుకుంటూ, సమిష్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఎంతో ముందుచూపుతో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించిన తీరు, సహకరించిన విధానాన్ని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. శ్రీసిటీని డాక్టర్ వైయస్సే ప్రారంభించారని, నేడు ఇది దేశంలోని ఉత్తమ ఏకీకృత వ్యాపార నగరాల్లో ఒకటిగా అవతరించిందని సంతోషం వ్యక్తం చేశారు. 'వర్క్-లివ్-లెర్న్-ప్లే' అనే సూత్రంపై ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో శ్రీసిటీ ఎదిగిందన్నారు. కోవిడ్-19 మహమ్మారితో కొత్త పాఠాలు నేర్చుకున్నామని, స్వయం సమృద్ధి దిశగా 'ఆత్మనిర్భర్ శ్రీసిటీ'గా రూపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వాక్ టు వర్క్ పద్ధతిలో విస్తృతంగా నివాస సముదాయాలను ఏర్పాటుచేసేందుకు కృషి జరుగుతోందని, ఎగుమతులు దిగుమతులను మరింత సులభతరం చేయడానికి ఇప్పటికే అంతర్జాతీయ విమానాశ్రయంగా ఉన్న తిరుపతి (రేణిగుంట) విమానాశ్రయం వెంటనే తన కార్గో క్యారేజ్ సౌకర్యాలను ప్రారంభించాలని ఆయన సూచించారు.




మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టి సారించి సుస్థిర అభివృద్ధిని సాధించాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పనితీరు అభినందనీయమని, మౌలిక సదుపాయాలను విస్తృత స్థాయిలో ఏర్పరచడం ద్వారా ప్రభుత్వ పారిశ్రామిక విధివిధానాలు, ప్రక్రియలు వేగంగా ముందుకు సాగుతాయని, ప్రభుత్వం ఆ దిశగా తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని తెలిపారు.

### పారిశ్రామిక అభివృద్ధితోనే రాష్ట్ర ఆర్థిక వృద్ధి - కరికాల వల్లవన్

రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికాల వల్లవన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వృద్ధి పారిశ్రామిక అభివృద్ధిపై ఆధారపడి ఉంటుందన్నారు. పారిశ్రామిక రంగంలో ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించే మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, పారిశ్రామిక విధానంలో మార్పులు చేయడం జరిగిందని, అత్యుత్తమ మౌలిక వసతులు, ఎలాంటి జాప్యం, అవరోధాలు లేకుండా అన్ని అనుమతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రభుత్వం చేయూత తదితర అంశాలను సమన్వయపరిచే విధంగా ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్ హబ్‌గా, ఆగ్నేయాసియాకు ప్రవేశద్వారంగా మారడానికి నాలుగు కొత్త ఓడరేవుల అభివృద్ధి జరుగుతోందన్నారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మెన్ డి.రామకృష్ణ, టాటా హిటాచీ కన్‌స్ట్రక్షన్ మెషినరీ కంపెనీ ప్రై.లి. ప్రెసిడెంట్ సందీప్‌సింగ్, కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సి.శేఖర్‌రెడ్డి తదితరులు ఈ వేదికలో పాల్గొన్నారు.

---

## గూడూరు డివిజన్ వార్తలు

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

**- కమిషనర్ ఓబులేసు**



గూడూరు పట్టణంలోని వ్యాపారులు కోవిడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఓబులేసు అన్నాడు. గూడూరు పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 1వ తేదీ విలేకరులతో ఆయన మాట్లాడుతూ దుకాణ నిర్వహణకు రోజూ మధ్యాహ్నం 1గంట వరకు సమయమిస్తున్నట్లు, పట్టణంలో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలని స్పష్టం చేశాడు. దుకాణాల వద్ద వినియోగదారులు భౌతిక దూరం పాటించాలని, అందరూ విధిగా మాస్కులు ధరించాలని, కరోనా నిర్ధారణ పరీక్షలతో సంబంధం లేకుండా జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరాడు.

### దివ్యాంగ క్రీడాకారుడికి

# రోటరీ ప్రోత్సాహం




జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఇటీవల గూడూరు కమ్యూనిటీ హాల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ క్రీడా ట్రస్ట్ వారు ప్రపంచ స్థాయి దివ్యాంగ క్రీడాకారుడు మామిడి లక్ష్మయ్యకి పది వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. సెప్టెంబర్ 20, 21 తేదీలలో జరగబోవు పారా అంతర్జాతీయ క్రీడా పోటీలలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొనేందుకు సాధన చేసి సన్నద్ధం కావడానికి లక్ష్మయ్యకి ఈ ఆర్థిక సహాయం అందించారు. రోటరీ అధ్యక్షుడు జి.ఎస్.రాఘవరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారు నిర్వహించే అల్లూరు ఆదిశేషారెడ్డి స్పోర్ట్ అండ్ గేమ్స్ ట్రస్ట్ ద్వారా క్రీడలకు సంబంధించి చాలా కార్యక్రమాలు చేయడం జరుగుతోందన్నాడు. మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ మామిడి లక్ష్మయ్య తప్పకుండా బంగారు పతకం సాధించి మన దేశానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించాడు. మేనేజింగ్ ట్రస్టీ పి.జానకిరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సెక్రటరీ బి.శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. కోశాధికారి టి.సురేష్‌రెడ్డి, ఎం.దయాకర్‌రెడ్డి, ఏ.బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డిఎస్పీని కలిసిన పేర్నాటి

గూడూరు సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి రాజగోపాల్‌రెడ్డిని గత నెల 31న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఇటీవలే గూడూరు డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజగోపాల్‌రెడ్డిని శ్యాంప్రసాద్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశాడు. గూడూరు డివిజన్‌లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పేద బడుగు బలహీనవర్గాల వారికి అన్యాయం జరిగితే వారికి సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలని కోరాడు.

### పెట్టుబడుల ఉపసంహరణపై

# ఎల్ఐసి ఉద్యోగుల నిరసన




దేశ ప్రగతిలో విశేషపాత్ర పోషిస్తున్న ఎల్ఐసిలో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం కేంద్రం వెనక్కి తీసుకోవాలని గూడూరు పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, యూనియన్ అధ్యక్షుడు యజ్ఞాని ఇటీవల డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించాడు. ప్రభుత్వ నిర్ణయం సరికాదని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, రాజశేఖర్, డి.బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### జగ్జీవన్ రామ్ భవనం

# మంజూరు చేయండి



గత నెల 31న గూడూరు డివిజన్ మాదిగ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌లో ఎస్సీలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారు తమ సమస్యలపై సమావేశాలు నిర్వహించుకోవాలన్నా, వివాహాలు వంటి శుభకార్యాలు వేలాది రూపాయలు చెల్లించి సెమినార్ హాళ్ళు, కళ్యాణ మండపాలలో జరుపుకోవాల్సి వస్తోందని, దీంతో వారు అవస్థలు పడుతున్నారని, పట్టణంలో 'జగ్జీవన్ రామ్ భవనం' మంజూరు చేయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి భవనం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చాడు.

# వృద్ధులకు నిత్యావసర సరుకులు



గత నెల 30వ తేదీ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కీ॥శే॥ ఇసుకపల్లి విశాలాక్షమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సీనియర్ జర్నలిస్ట్ శివప్రసాద్‌శర్మ సహాయసహకారాలతో రెండు బస్తాల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గసభ్యులు కార్పొరేషన్ రవికుమార్, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మేకల మస్తానయ్య, కరిముల్లా, జెనెరిక్ తిరుమలరావు, కో ఆర్డినేటర్ సతీష్, నిర్వాహకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమఫలాలు

**- ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



అర్హులైన ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందని, పార్టీలకు అతీతంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరువలోకి వస్తున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరు మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో గతనెల 31న ఆయన గ్రామ సచివాలయం వద్ద గ్రామ వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందకపోయినా, అనర్హులకు లబ్ధి చేకూరినా వాలంటీర్లదే బాధ్యత అన్నారు. ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తోందని, పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని చెప్పారు. రైతు భరోసా, అమ్మఒడి, వైయస్సార్ చేయూత, జగనన్న విద్యాదీవెన తదితర పథకాలను అర్హులైనవారికి అందించాలన్నారు. సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సంక్షేమం చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు చిల్లకూరు శ్రీధర్‌రెడ్డి, కోడూరు పురంధర్‌రెడ్డి, కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు ఎంపిడిఓ హేమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అన్యాయం చేయకండి

జిల్లాలోని రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సోమవారం (గతనెల 31) జిల్లా వ్యాప్తంగా బిజెపి నాయకులు ఆందోళనలు చేశారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో బిజెపి నాయకుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పుట్టి ధాన్యానికి దళారులు కేవలం 10వేల రూపాయలిచ్చి బిల్లుల్లో మాత్రం 16వేలు రాసుకుంటున్నారని, నకిలీ సంతకాలు చేస్తూ అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్ళి జేసీ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయులు, రాధాకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు సంఘాల ధర్నా :**

ఎడగారులో పండిన ధాన్యాన్నంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మిల్లర్లు దళారుల బాధ నుంచి రైతులను విముక్తి చేయాలని కోరుతూ నెల్లూరులో రైతు సంఘం నాయకులు గతనెల 31న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన చేశారు. మిల్లర్ల దోపిడీ వల్ల రైతులు బాగా నష్టపోతున్నారని, ఈ అన్యాయాన్ని అరికట్టాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ ఆందోళనలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకమరాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

# సోమశిలకు కృష్ణమ్మ పరుగులు

**- జలకళతో తొణికిసలాడుతున్న జలాశయాలు**



అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయానికి కృష్ణానది నీరు తరలిరావడంతో సోమశిల జలాశయం, కండలేరు జలాశయాలు జలకళతో తొణికిసలాడుతున్నాయి.

సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 78 టిఎంసిలు కాగా, సోమవారం(గతనెల 31) నాటికి డ్యామ్‌లో 311.88 అడుగుల నీటిమట్టం నమోదైంది. మొత్తంగా 43.958 టిఎంసిల నీరు డ్యామ్‌లో ఉంది. మరికొద్దిరోజుల్లో నీటిమట్టం మరింత పెరుగుతుందని కూడా భావిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 20 నుంచి 23 వేల క్యూసెక్కుల దాకా నీటి ప్రవాహం సోమశిలకు వస్తోంది. శ్రీశైలం జలాశయం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి గతనెల 19న నీటిని విడుదల చేశారు. అప్పటికి సోమశిల జలాశయంలో 29 టిఎంసిల నీరుంది. ఇప్పుడు సుమారు 15 టిఎంసిల నీరు అదనంగా చేరినట్లు అధికారుల గణాంకాలు చెప్తున్నాయి. ఇప్పుడు వస్తున్న నీటి ప్రవాహంలో 8 వేల క్యూసెక్కులను కండలేరు జలాశయానికి విడుదల చేసి మిగిలిన నీటిని డ్యామ్‌లో నిల్వ చేస్తున్నారు. మరోవైపు జలాశయం ప్రాంతాలలో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఈసారి సేద్యానికి సాగునీరు పుష్కలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కండలేరు జలాశయంలో కూడా నీటిమట్టం పెరిగింది. సోమవారం నాటికి ఇక్కడ 23.529 టిఎంసిల నీరు నిల్వ ఉంది. సత్యసాయి గంగకాలువకు 50 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, లోలెవల్ స్లూయిస్‌కు మరో 10 క్యూసెక్కుల వంతున ఇక్కడినుంచి నీటిని విడుదల చేస్తున్నారు.

**హోం ఐసొలేషన్‌లో ఉన్నవాళ్ళకి**

# మందుల కిట్‌లు



కరోనా వ్యాధితో బాధపడుతూ హోం ఐసొలేషన్‌లో ఉంటున్నవారికి అవసరమైన మందుల కిట్‌లను అందజేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు సమాయత్తమవుతున్నారు. బాధితులకు తొలివిడతగా 10వేల మందుల కిట్‌లను కలెక్టర్ మంజూరుచేయడంతో త్వరితగతిన వీటిని రెండుమూడు రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.. మందులతో పాటు మాస్కులు, మందుల వినియోగానికి సంబంధించిన కరపత్రాలతో ఈ కిట్‌లను అందజేస్తారు. హోం ఐసొలేషన్ నోడల్ అధికారి, డిపిఓ ధనలక్ష్మికి వీటిని అప్పగించడంతో బాధితులకు అందజేసేందుకు ఆ మందులను సిద్ధం చేస్తున్నారు.

# రైతులకు సాయంగా.. కంట్రోల్‌రూమ్

**- పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రోజ్‌మాండ్**

జిల్లాలో ఈ ఎడగారు సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు కొత్తగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేశామని, ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇది పనిచేస్తుందని, రైతులు ఈ ఏర్పాటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రోజ్‌మాండ్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ఏవైనా ఇబ్బందులుంటే రైతులు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 0861-230651 అనే నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని, రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు తమ సహాయ సహకారాలుంటాయని పేర్కొన్నారు. ధాన్యానికి ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధర కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని ఆమె పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమశాతాన్ని కొలిచే మిషన్లు, గోతాలు అందుబాటులో ఉంచడం జరిగిందని వివరించారు. దళారుల దోపిడీకి గురికాకుండా రైతులు తాము పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని సూచించారు.

## 'నెల్లి చెట్టు' కింద వెలిసిన మహాదేవుడే...

# నెల్లూరు మూలస్థానేశ్వరుడు

**'నెల్లి చెట్టు' అంటే..ఉసిరిక చెట్టు. పురాతనకాలంలో ఈ చెట్టుకిందనే మహాశివుడు లింగాకారంలో స్వయంభువుగా వెలిశాడు. ఆ మహా పుణ్యక్షేత్రమే నెల్లూరు నగరంలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం. భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా మూలస్థానేశ్వరుడు ప్రసిద్ధి.**



**మన దేవాలయాలు (11)**

నెల్లిచెట్టు కింద పరమశివుడు ఆవిర్భవించిన దివ్యప్రదేశం కనుక పూర్వకాలంలో ఈ ప్రాంతం 'నెల్లి ఊరు'గా, అదే ఆ తర్వాత కాలంలో 'నెల్లూరు'గా మారిందని పెద్దలు చెప్తుంటారు. అంతే కాదు, ధాన్యం బాగా పండే ఊరు కనుక 'నెల్ల'(ధాన్యం) ఊరుగా, అదే కాలగమనంలో నెల్లూరుగా మారి ఉంటుందని కూడా కొందరు అంటున్నారు. ఏదేమైనా ఎంతో ప్రాచీనకాలం నాటి ఈ ఆలయం నెల్లూరు ఆధ్యాత్మిక వైభవానికి ఒక ప్రతీకగా ఉంటూ.. నేటికీ దేదీప్యమానంగా వెలుగొందుతోనే ఉంది.

**ముక్కంటిరెడ్డి నిర్మించిన ఆలయం :**

ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయ చరిత్రకు సంబంధించి స్థలపురాణం ప్రకారం.. ఒకప్పుడు ఈ ప్రాంతంలో త్రినేత్రుడనే ముక్కంటిరెడ్డి అనే నాయకుని పాలన సాగుతుండేది. ఆయనకు ఒక పెద్ద పశువులు మంద ఉండేది. ఆ మందలోని ఒక గోవుకు పరమశివుడు లింగాకారంలో ఈ భూమిపై అవతరించినట్లు అనిపించి, అంతా వెదికి చివరికి నెల్లిచెట్టు కింద శివలింగం ఉన్నట్లు తెలుసుకుని, రోజూ అక్కడికి పోయి తన పాలతో శివలింగాన్ని అభిషేకిస్తుండేది. దీంతో ఆవు సరిగా పాలివ్వడం లేదేమిటని ముక్కంటిరెడ్డి పశువుల కాపరిని ప్రశ్నించాడు. కారణమేమిటో తెలియక, ఆ కాపరి ఆ గోవును కనిపెట్టుకుని ఉండి, దాని వెనుకగా వెళ్ళి పాలతో ఆ గోవు శివలింగాన్ని అభిషేకించడం చూసి కోపంతో కత్తితో కొట్టడంతో శివలింగం నుంచి రక్తం కారుతుంది. పశువుల కాపరి భయపడుతూ వెళ్ళి ఈ విషయాన్ని ముక్కంటిరెడ్డికి చెప్పాడు. ఆ తర్వాత ఒక రోజు ఈశ్వరుడు ముక్కంటి రెడ్డికి స్వప్నంలో కనిపించి ఈ ప్రాంతంలోని ఉసిరిక చెట్టు కింద ఉన్న శివలింగానికి ఆలయం కట్టించవలసిందిగా ఆదేశించాడు. పరమేశ్వరుని ఆదేశం ప్రకారం ముక్కంటిరెడ్డి ఇక్కడ ఈ ఆలయాన్ని కట్టించి 'శ్రీ మూలస్థానేశ్వరాలయం' అని నామకరణం చేసి నిత్య పూజలు జరిగేలా ఏర్పాటుచేశాడని నాటి కాలం కథనం.

**ఎంతో విశిష్టమైన కోవెల :**

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కొలువైన్న ఈ మూలస్థానేశ్వరాలయం ఎంతో విశిష్టమైనది. ఆలయంలోని గర్భగుడిలో మహాశివలింగాకారంలో ఉన్న పరమశివునితో పాటు, ఆగ్నేయభాగంలో విఘ్నేశ్వరుడు, దక్షిణాభిముఖంగా దక్షిణామూర్తి, పశ్చిమంలో మహావిష్ణు, ఉత్తరాభిముఖంగా బ్రహ్మ, ఈశాన్యంలో ఉత్తరాభిముఖంగా దుర్గాదేవి వెలిసి వుండడం ఈ ఆలయం ప్రత్యేకత. గర్భాలయం ప్రాంగణంలోనే నవగ్రహాలకు మందిరం ఉంది. ఈ ఆలయ సముదాయంలో భువనేశ్వరి అమ్మవారి మందిరంతో పాటు, నటరాజస్వామి, సహస్రలింగేశ్వరుడు, సూర్యనారాయణస్వామిలకు కూడా గుడులున్నాయి. ఆలయం నాలుగుదిక్కుల్లోనూ విఘ్నేశ్వరుని ప్రతిష్టించి ఉండడం విశేషం. ఈ ఆలయ ప్రాంగణంలో నాగ ప్రతిష్టతో పాటు, వీరభద్రస్వామి, కాలభైరవులకు ప్రత్యేక మందిరాలున్నాయి. ఇవన్నీ కూడా చాలా పురాతనమైనవే. ఇటీవలి కాలంలో దాతల సహకారంతో ఈ శివాలయం బాగా అభివృద్ధి చెందింది. ప్రవేశద్వారం స్వర్ణకాంతులతో ధగధగ మెరుస్తూ ఉంటుంది. రాజగోపుర నిర్మాణం జీర్ణోద్ధరణతో పాటు అష్టాదశ పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టలక్ష్ముల ప్రతిమల ప్రతిష్టతో, సరస్వతీదేవి మందిరం, స్వామివారికి కొత్త రథం అన్నీ సమకూరి ఆలయం సకలదేవతామందిరంగా శోభిల్లుతోంది. ఆలయం ముందు భాగంలో ఒక పెద్ద వినాయకుడి మండపం భక్తాదులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటుంది.

**కార్తీక దీపారాధనలు..**

**శివరాత్రి వేడుకలు :**

కార్తీకమాసంలో కార్తీకదీపారాధనలతో ఇక్కడ వైభవంగా వేడుకలు జరుగుతుంటాయి. నవరాత్రుల రోజుల్లో భువనేశ్వరిదేవి అమ్మవారికి శోభాయమానంగా అలంకరణలు చేసి విశిష్టపూజలు నిర్వహిస్తుంటారు. మాఘ మాసంలో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. శివరాత్రి పర్వదిన వేడుకలు మరింత వైభవంగా ఉంటాయి. విశేష దినాల్లో రుద్ర యాగాలు, చండీయాగాలతో పరమశివుని భక్తితో అర్చిస్తుంటారు.

వీక్షణం

- మంజీర

# ‘మనవాడేనా’

**‘మనవాడే’** అనే మాట ఎంతో సంతోషాన్నిస్తుంది. మనకంటూ ఒకరున్నారనే భరోసా అది. మనుషులు ‘తమను తాము’ ప్రత్యేకంగా విభజించుకుని ‘మనవాడే, మనవాడే’ అని తమ వాళ్ల భుజాలను మాత్రమే తట్టుకుంటున్నారు. ‘మనవాడే’ అని భుజం తట్టడానికి తనకంటూ ఎవరూ లేని వ్యక్తి ఎప్పటికీ ఎవరికీ కానివాడుగానే మిగిలిపోతున్నాడు. తనకంటూ ఎవరూ లేని సమూహంలో అడుగు పెట్టడానికి కూడా భయపడుతున్నాడు. ఆ భయాల్ని పక్కన పెట్టి... సాహసం చేస్తే సుశాంత్ సింగ్ రాజ్‌పుత్‌లా వార్తల్లో మిగులుతున్నారు. ఇది అరేబియా తీరం సాక్షిగా బాలీవుడ్‌లో నెలకొన్న నెపోటిజమ్. అవకాశాలను తమ వాళ్లకు మాత్రమే కల్పించాలనే ‘స్వాభిమానం’ అది. ఆ స్వాభిమానం తమవాళ్లను ప్రోత్సహించడంతో ఆగిపోకుండా... తమకు కానివాళ్లకు అవకాశాల దారులు మూసేసే వరకు కరడుగట్టుకుపోయింది. దశాబ్దాలుగా అగ్నిపర్వతంలా ఉడుకుతూ ఉన్న ‘నెపోటిజమ్’ సుశాంత్ మరణంతో భళ్లున పేలిపోయింది. నెపోటిజానికి బలయిన ఒక మంచి నటుడు సుశాంత్. మన దగ్గర ఓ టాలీవుడ్ కిరణం ఉదయించకనే అస్తమించింది. మరో ‘విజయ’ సాధకుడు క్రమంగా తెరమరుగవుతున్నాడు. తెలుగు ఇండస్ట్రీ ‘ఆ నాలుగు కుటుంబాలదే’. ‘ఆ నాలుగు’కు కాని కుటుంబాల నుంచి వచ్చిన ‘టాలెంట్’ ఏదీ నాలుగు కాలాల పాటు మనగలగడం లేదు.

## క్రీడా‘స్వా’భిమానం

అందరి దృష్టి సినిమారంగం మీదనే ఎక్కువగా ఉంటుంది. కానీ క్రీడారంగంలో నెపోటిజం తక్కువగా ఏమీ లేదు. సునీల్ గవాస్కర్ కొడుకు రోహన్ గవాస్కర్ భారత క్రికెట్ టీమ్‌కు ఎన్నికైనప్పుడు ఒక చిన్నపాటి కలకలమే రేగింది. రోహన్ కంటే ఎక్కువ టాలెంట్ ఉండి, కుటుంబం నుంచి సపోర్టు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో టీమ్‌లో అడుగు పెట్టలేక పోయిన పేద, మధ్య తరగతి వర్గాల కుర్రాళ్లు ఎందరో సామాన్య క్రీడాభిమాని మనసులో మెదిలారు. అర్జున్ టెండుల్కర్ ‘అండర్ 19’ టీమ్‌కు ఎన్నికైనప్పుడు కూడా మరో తుపాను. ‘రోహన్, అర్జున్‌లు మంచి ఆటగాళ్లు. వాళ్ల తండ్రులు క్రికెట్ క్రీడాకారులు అయిన కారణంగా వాళ్లకు జట్టులో అవకాశాలు ఇవ్వకూడదనడం న్యాయమేనా. వాళ్లు క్రికెట్‌కు దూరంగా ఉండాల్సిందేనా” అని లౌక్యమైన ప్రశ్న సంధించాడు మాజీ క్రికెట్ క్రీడాకారుడు ఆకాశ్ చోప్రా. తండ్రుల క్రికెట్ నేపథ్యం వాళ్లకు అడ్డం కాకూడదు. నిజమే, అలాగే మరొక ‘టాలెంట్’కు వీళ్ల క్రికెట్ నేపథ్యం ఆటంకంగా కూడా మిగలకూడదు. అదే ఇప్పుడు చర్చ. ఒక గుత్తా జ్వాల, సైనా నెహ్వాల్ గొంతు చించుకున్నది కూడా క్రీడారంగంలో ‘స్వాభిమానం’ పెద్ద పీట వేసుకుంటోందనే. నోరు విప్పినందుకు వాళ్ల మీదనే నోరేసుకుని పడిపోయింది సమాజం. అంతే తప్ప... క్రీడాప్రపంచంలో బయటకు కనిపించని ‘స్వాభిమాన చక్రం’ ఏదో తిరుగుతోందని క్షణం కూడా ఆలోచించలేకపోయింది.

## ప్రజాస్వాభిమానం

ఇది మరీ బాహాటంగా వలువలిప్పుకున్న స్వాభిమానం. ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లేయించుకుని గెలిచిన ప్రతినిధులే చట్టసభలో మనకు ప్రాతినిధ్యం వహిస్తారు. అంతా రాజ్యాంగబద్ధంగానే జరుగుతుంది. ‘రాజ్యాంగబద్ధంగా జరగడం’ అనే ప్రక్రియ ఒక డైరెక్షన్‌లో నడుస్తుంటుంది. దేశ రాజకీయాలను నిర్ణయించేది ప్రజలే, కానీ నడిపించేది రాజకీయ పార్టీలు. ఆ పార్టీల పగ్గాలు ‘కుటుంబం’ చేతిలోనే ఉంటాయి. మరీ విసిగిపోయినప్పుడు పార్టీ అభిమానుల్లో ఒకరు ‘కుటుంబపాలన’ అని గొంతు చించుకోవడం, ఆ గొంతుకను పార్టీ అధిష్ఠానం ప్రభుభక్తులు నొక్కేయడం పరిపాటి. ప్రజాస్వాభిమాన బురద ‘చేతి’కి బాగా అంటుకుని పోయి ఉంది. ఎంత కడిగినా వదలనంతగా చర్మానికి పట్టేసింది. ఆ కుటుంబం... పార్టీని నడిపించే స్థాయిలో లేదు. జవసత్వాలుడిగిన ఈ పార్టీని లాగడం ‘నా వల్ల కాద’ంటూ యువరాజు కాడిని దించేసి విశ్రమించడానికి ఉద్యుక్తుడైనప్పటికీ ‘నిన్ను వదల బొమ్మాళీ’ అని వెంటపడుతున్న నెపోటిజమ్ అది. తనకై తానే కాడి దించేసిన అదే యువరాజు... పార్టీని నిలబెట్టడానికి పార్టీ సీనియర్‌లు తీసుకున్న చొరవను భరించలేక ఆగ్రహోదగ్రుడు కావడమే నెపోటిజానికి పరాకాష్ట. ‘ఈ పార్టీ మా ‘చేతి’లోనే ఉండాలి’ అని చెప్పకనే చెప్పడం అది. ఇక ప్రాంతీయ పార్టీల గురించి చెప్పాల్సిన పని లేదు. పేరుకు రెండేళ్లకోసారి సంస్థాగత ఎన్నికలు జరుగుతాయి. కోటరీలో ఒక సీనియర్ మైకు ముందుకొచ్చి తమ పార్టీ అధినాయకుడి పేరునే మళ్లీ అధ్యక్ష స్థానానికి ప్రతిపాదించడం, మరి కొందరు సీనియర్‌లు బలపరచడం, కార్యకర్తలు చప్పట్లు కొట్టడం, మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ‘ఫలానా నాయకుని’ పేరును అధికారికంగా ప్రకటించడం జరిగిపోతుంటుంది. ప్రాంతీయ పార్టీల్లో సంస్థాగత ఎన్నికలనేవి ఒక ప్రహసనం మాత్రమే. కనీసం ప్రహసనంగానైనా సంస్థాగత ఎన్నికలు జరగడంలేదని గుర్తు చేసినందుకు... ఆ గుర్తు చేసిన సీనియర్‌ల మీద గుడ్లురిమాడు యువరాజు.

## వారసులే ప్రతినిధులు

మన దేశ పార్లమెంట్ మీద మూడేళ్ల కిందట ప్యాట్రిక్ ఫ్రెంచ్ అనే ఒక యూరోపియన్ అధ్యయనం చేశాడు. లోక్‌సభకు ఎన్నికైన ఎంపీల్లో యువకులందరూ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల వాళ్లేనని నిర్ధారించాడు. నలభై దాటిన వాళ్లలో కూడా ఎక్కువ మంది వారసత్వంగా రాజకీయరంగంలోకి వచ్చిన వాళ్లే. రాజకీయ నేపథ్యం లేని వాళ్లకు రాజకీయరంగంలో అడుగుపెట్టే అవకాశం రాకపోతే క్రమంగా దేశం రాజరిక వ్యవస్థలోకి వెళ్లిపోయినట్లేనని ఘాటుగా విమర్శించాడు ప్యాట్రిక్. ఒక పైలట్, ఒక సింధియా, ఒక కనిమొళి, ఒక అఖిలేశ్ యాదవ్‌లు రావచ్చు. ‘వాళ్ల తండ్రులు రాజకీయ నాయకులు కాబట్టి వీళ్లు రాజకీయ రంగంలో అడుగుపెట్టరాద’నే నిబంధన ఎక్కడా ఉండదు, ఉండకూడదు కూడా. అందరిలాగానే వీళ్లకూ సమాన అవకాశాలు ఉండాలి. అయితే మరొకరికి అవకాశం కల్పించని పరిస్థితులే ఇప్పుడు ప్రశ్నార్థకాలు. ‘తాను నిర్మించిన రాజకీయ సౌధంలో తనవాళ్లు మాత్రమే ఉండాల’నే స్వాభిమానం ప్రాంతీయ పార్టీ నాయకులది. ఇతరులకు ఒకసారి అవకాశం కల్పిస్తే తిరిగి తన వాళ్లకు అవకాశం రాదేమోననే భయం కూడా. దీనికి తోడు వోట్ బ్యాంకు రాజకీయాలు కూడా కారణమే. ఈ వోట్ బ్యాంకు కులం చుట్టూ తిరగడం మనదేశంలో మరొక ప్రత్యేక సమీకరణ. దీనంతటికీ మూలం మనకు మలి వేద కాలంలో కనిపిస్తుంది. బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించిన తర్వాత తమకు అందుతున్న గౌరవం, ప్రశంసా పూర్వకమైన మకుటాలు తమ పిల్లలకు పుట్టుకతోనే వచ్చేయాలనే స్వార్థం ఆనాటి పండితుల్లో కలిగింది. ఆ స్వార్థమే ‘కులా’నికి నారు పోసి నీరు పోసింది. ఇప్పుడది వేళ్లూనుకుని పోవడం కాదు కదా, రక్తంలో కలిసిపోయింది. నరనరాన జీర్ణించుకుపోయింది. నెపోటిజాన్ని అణచివేయాలంటే మొదట ‘నీ కులం... నా కులం’ అనే భావనను సమూలంగా వదిలించాలి. ఒకప్పుడు ఆలయ ప్రవేశమే లేని వాళ్లు ఇప్పుడు ఆలయాల్లో పూజలు చేయగలుగుతున్నారు. తరతరాల అణచివేత నుంచి ఎగిసిపడిన ఉజ్వల కెరటమే ఈ మార్పు. ఇలాంటి గొప్ప ముందడుగు పడడానికి వెనుక ఎంతో పోరాటం ఉంది. తనవాళ్లు, తనకు కానివాళ్లు అనే స్వాభిమాన విభజనను మెదళ్ల నుంచి దులపడానికి ఇంకా ఎంత మంది సుశాంత్‌సింగ్‌లు ప్రాణాలర్పించాలి? ఈ స్వాభిమాన ఆకలి తీరడానికి ఎన్ని ప్రాణాలు బలవ్వాలి?

# రాజన్నకు ఘన నివాళి

(మొదటి పేజీ తరువాయి)



కూడా వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రాజశేఖరరెడ్డి అభిమానులు వైయస్ 11వ వర్ధంతి సందర్భంగా ఆ మహానేతను స్మరించుకుని నివాళు లర్పించారు.

## వైయస్సార్ సేవలు.. చిరస్మరణీయం

**- మంత్రి అనిల్**

తెలుగు ప్రజల గుండెల్లో మహానేతగా, ప్రజా నేతగా డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నారని, ఆ మహానాయకుని సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డా.వైయస్ఆర్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలివద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు వైయస్సార్సీపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం - మంత్రి గౌతంరెడ్డి



అనేక ప్రజాసంక్షేమ పథకాలతో మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని డాక్టర్ వైయస్‌ను స్మరించుకుంటూ రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి నెల్లూరులోని తన నివాసంలో డా.వైయస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండ్రి ఆశయాలను తనయుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని కొనియాడారు.

## మహోన్నత నేత డా.వైయస్సార్ - ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



డాక్టర్ వైయస్సార్ మహోన్నత నేత అని, రాష్ట్రంలో ప్రజలకోసం అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని పొందారని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. అదేవిధంగా తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపడుతుండడం ఎంతో అభినందనీయమన్నారు. తొలుత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులోని తన కార్యాలయంలో టిటిడి పాలకమండలి సభ్యురాలు ప్రశాంతిరెడ్డితో కలిసి వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పేదప్రజల ఆరాధ్యనాయకుడు వైయస్సార్

**- నాయకుల ప్రశంస**



రాష్ట్రంలో రైతన్నల సంక్షేమం కోసం, పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడిన మహానేత, పేదప్రజల ఆరాధ్య నాయకుడు డా.వైయస్సార్ అని జిల్లాలోని నాయకులు ప్రశంసించారు. నెల్లూరు నగరంలోని వైయస్సార్సీపి కార్యాలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ, నెల్లూరు కరెంటాఫీస్ సెంటర్‌లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ వైయస్ఆర్‌కు ఘన నివాళులర్పించారు.




కోవూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరులో ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావుల ఆధ్వర్యంలో వైయస్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. జిల్లాలోని వైకాపా నాయకులు డా.వైయస్‌ని స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు.







## కాలధర్మం



### వేమారెడ్డి రాజగోపాలరెడ్డి

ఈదగాలి రాజయ్యగా జిల్లావాసులకు సుపరిచితుడు, ప్రముఖ కాంట్రాక్టర్ వేమారెడ్డి రాజగోపాలరెడ్డి ఆగస్టు 30వ తేదీ కన్నుమూశారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు, స్వగ్రామం ఈదగాలి. రాజగోపాలరెడ్డి బాల్యవిద్యాభ్యాసం గూడూరు, నెల్లూరులతో పాటు చెన్నై ముత్తయ్య చెట్టి స్కూల్‌లో జరిగింది. ఆ తరువాత చెన్నైలోని వివేకానంద కాలేజీలో ఉన్నత విద్యాభ్యాసం చేసి పచ్చయప్పా కాలేజీలో యంఏ పట్టా పుచ్చుకున్నాడు. వేమారెడ్డి కుటుంబంలో డిగ్రీ పుచ్చుకున్న తొలి తరం మేధావి రాజయ్యే.

రాజయ్యకి గ్రామ రాజకీయాలపై పట్టు ఎక్కువ. రాజకీయాలలో తమ కుటుంబ ప్రాధాన్యత ఉండాలని ఎప్పుడూ తపన పడేవాడు. తాను ఏనాడూ ప్రత్యక్ష రాజకీయాలలో లేనప్పటికి పరోక్షంగా అనేకమంది నాయకుల గెలుపుకు ఆయనే కారణం. చదువు అనంతరం కొన్ని సంవత్సరాలు గ్రామంలోనే వుంటూ ఇడిమేపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి దాదాపు 20 సంవత్సరాలుగా అధ్యక్షుడిగా వుండి రైతుల అభ్యున్నతికి కృషి చేసాడు.

తరువాతికాలంలో కాంట్రాక్టర్‌గా మారి హైదరాబాదులో స్థిరపడ్డప్పటికీ గ్రామంలో మాత్రం పట్టు కోల్పోలేదు. ఏ చిన్న ఎన్నికలు జరిగిన ఆయన పరోక్షంగా ప్రధాన పాత్ర పోషించేవాడు. ఆనం సోదరులు వివేకానందరెడ్డి, రామనారాయణరెడ్డిలకు చాలా ఆప్తుడు. జెకెరెడ్డి, ఆదాల రాఘవరెడ్డిలకు మంచి మిత్రుడు. తన సోదరుడు (అన్న) వేమారెడ్డి శ్యామసుందరరెడ్డిని ప్రేరేపించి ప్రోత్సహించి ప్రత్యక్ష రాజకీయాలలో దింపింది రాజయ్యే.

రాజయ్యకు ఇద్దరు కుమారులు వంశీ, విక్రమ్ ఇద్దరూ సినిమారంగంలో ఎగ్జిబిటర్లుగా, పంపిణీదారులుగా, ప్రముఖ నిర్మాతలుగా స్థిరపడ్డారు. సినీ నటుడు ప్రభాస్ వంశీకి సహాధ్యాయి కాగా, హీరోలు రామచరణ్, శర్వానంద్‌లు విక్రంకి క్లాస్‌మెట్‌లు. సూళ్ళూరుపేట వద్ద నిర్మించిన అతి పెద్ద స్క్రీన్ కలిగిన థియేటర్ "వి ఎపిక్ " వంశీ, విక్రమ్‌ల సృష్టే.

రాజయ్యది ముక్కుసూటి మనస్తత్వం, తాను నమ్మిన సిద్ధాంతాల ప్రకారం అనుకున్నది చేసుకుంటూ వెళ్ళేవాడు, తానేదైనా చెయ్యాలని నిర్ణయించుకుంటే ఇక వెనుతిరిగి చూడడు. 2014 ఎన్నికలలో ఆనం సోదరులని కాదని కాకాణి గెలుపుకి కృషి చేయడమే అందుకు నిదర్శనం.

కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో బాధపడుతూ అకస్మాత్తుగా తుది శ్వాస విడిచాడు. రాజయ్య మృతికి చింతిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రఘాడ సానుభూతిని తెలుపుతోంది లాయర్.

### పాలడుగు సుధాకర్



కావలి వాస్తవ్యుడు, నాట్కో ఫార్మా ప్రొడక్షన్ మేనేజర్ పాలడుగు సుధాకర్ కోవిడ్‌కి బలైపోయాడు. ఆయన వయసు 57 సంవత్సరాలు. స్వస్థలం కావలి అయినప్పటికి తన తండ్రి ఉద్యోగ రీత్యా సుధాకర్ బాల్యంనుండి నెల్లూరులోనే పెరిగాడు. నాట్కో లో ఉద్యోగిగా హైదరాబాదులో ఉండేవాడు. 5నెలల క్రితం నెల్లూరు జిల్లాకు బదిలీపై వచ్చి ఆగస్టు 29వ తేది శనివారం కరోనాకి బలయ్యాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు వున్నారు.

సుధాకర్ తమ్ముడు సురేంద్ర స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న అక్షర స్కూల్‌లో మేనేజింగ్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. సుధాకర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది లాయర్.

### అయితా ఆనందకృష్ణయ్య



సూళ్ళూరుపేట ఆర్యవైశ్య ప్రముఖుడు, సేవాభిలాషి అయితా ఆనందకృష్ణయ్య గతనెల 27న పరమపదించారు. నెల్లూరులోని శ్రీ సర్వోదయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కమిటీ అధ్యక్షులుగా నిస్వార్ధంగా పనిచేసిన అయితా ఆనందకృష్ణయ్య నెల్లూరీయులందరికీ కూడా సుపరిచితులే. ఏపి ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా పనిచేయడంతో పాటు, శ్రీ చెంగాళమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డుకు కూడా ఆయన ఎనలేని సేవలందించాడు. ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో వివిధ శాఖలకు సారథ్యం వహించాడు. దక్షిణమధ్య రైల్వే జోనల్ రీజియన్ మెంబర్‌గా ఆయన సేవలు అపారం. సూళ్ళూరుపేటలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి అభిమానానికి పాత్రుడయ్యాడు. ఈయనకు ముగ్గురు కుమారులు. చెన్నైలో ప్రముఖ డయాబెటిస్ డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ విజయకుమార్ ఈయన కుమారుడే. ఆనందకృష్ణయ్య ఆకస్మిక మరణానికి చింతిస్తూ నెల్లూరులోని ఆయన ఆత్మీయుడు, ఆర్యవైశ్య ప్రముఖుడు, రొటేరియన్ కెవి చలమయ్యతో పాటు అనేకమంది ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి తమ సంతాపం ప్రకటించారు. ఆనందకృష్ణయ్య వంటి సేవామూర్తులు అరుదు. ఆయన మృతికి నివాళులర్పిస్తోంది లాయర్!..



## జ్ఞాన గంధర్వుడు కోలుకుంటున్నాడు

తన గానాలతో ఆబాల గోపాలాన్ని అలరించిన జ్ఞాన గంధర్వుడు క్రమేణా కోలుకుంటున్నాడు. అంతర్జాతీయ డాక్టర్ల సలహాలు సూచనల మేరకు మద్రాసులోని యం జి యం ఆసుపత్రి వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కోవిడ్ నుంచి తన తండ్రి నిదానంగా కోలుకుంటున్నాడని, వైద్యానికి స్పందిస్తున్నాడని ఆయన కుమారుడు యస్‌పి చరణ్ గురువారం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించాడు.

### ఉప రాష్ట్రపతి వెంకయ్య చొరవతో..

## పంట సేకరణ గడువు పెంపు



కరోనా మహమ్మారి నేపథ్యంలో అన్నదాతలు ఇబ్బందులు పడకుండా భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఎంతో చొరవ తీసుకుని రైతులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తన వంతు కృషిచేస్తున్నారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాలతో పోలిస్తే ప్రత్యేక వాతావరణ పరిస్థితులున్న నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో రైతులకు పంట ఆలస్యంగా చేతికి వస్తుంది కనుక పంట సేకరణ కాలాన్ని నెలరోజులకు పెంచాలని ఆయన కేంద్ర ఆహార పౌరసరఫరాల మంత్రిత్వశాఖవారికి సూచించడం, ఆ శాఖ వెంటనే రైతులకు పంట సేకరణ కాలాన్ని నెలరోజుల పాటు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం విశేషం. ఈ పంటకాలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నెల్లూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ వారు ఉప రాష్ట్రపతి దృష్టికి తీసుకురాగా వెంటనే మన వెంకయ్యనాయుడు స్పందించి రైతుల కోసం కేంద్ర మంత్రిత్వశాఖకు తగు సూచనలివ్వడం పట్ల రైతాంగంలో సంతోషం వ్యక్తమవుతోంది.

## నిషేధానికి ముందే నిషా

(మొదటి పేజీ తరువాయి)

అసలుకే ఎసురు తెచ్చేలా, నిషేధానికి ముందే నిషాలా, భవిష్యత్‌లో ఇంకెలా ఉండబోతోందో చెప్పేందుకు సంకేతంలా తయారైంది.

### ధరల పెంపే ప్రధాన కారణమా?

ఇతర రాష్ట్రాల మద్యానికి రాష్ట్రంలో ఎందుకు ఇంత డిమాండ్ ఉంది? ఎక్కడికక్కడ ఎస్ఈబీ, స్థానిక పోలీస్‌లు కలిసి తనిఖీలు చేస్తున్నా ఎందుకు అక్రమ రవాణాకు స్మగ్లర్లు రిస్క్ చేస్తున్నారు అంటే... ప్రధాన కారణం ధరల పెంపే అని వినిపిస్తోంది. మద్యాన్ని పేదలకు అందుబాటులో ఉంచకుండా ఉండేందుకు ప్రభుత్వం ధరలను భారీఎత్తున పెంచింది. 70శాతం వరకు ధరలు పెంచినా మద్యంప్రియులు అప్పులు చేసో, లేదంటే తాము పని చేయగా వచ్చిన మొత్తాన్ని వెచ్చించో, లేదంటే ఆ క్వార్టర్ మద్యం కోసమే పని చేయడమో ప్రారంభించారు. ఇలాంటి సమయాల్లో మన రాష్ట్రంలోని ధరలతో పోలిస్తే ఇతర రాష్ట్రాల్లో చాలా తక్కువ ధరకు మద్యం అందుబాటులో ఉండడంతో సహజంగానే వాటి వ్యాపారంపై కొందరు దృష్టి సారించారు. చివరకి రాజకీయ నాయకులు కూడా ఈ వ్యవహారాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలోనే గుంటూరులో బీజేపీకి చెందిన రాష్ట్ర కార్యదర్శి ఏకంగా ఈ అక్రమ మద్యాన్ని తరలిస్తూనే పట్టుబడ్డ విషయం అందరికి తెలిసిందే. ఒక్క బీజేపీనే అనేకాదు, దాదాపు అన్ని పార్టీల నేతలు ఇందులో భాగస్వామ్యులుగా ఉండి, కొంతమంది అమాయక జనాల్ని ఇందులో దింపి వాళ్ళ చేత ఈ వ్యాపారాలను చేయిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ విధంగా రాష్ట్రాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ బాటిల్ కనీస ధర 200 కాగా బయట రాష్ట్రాల నుంచి తెచ్చిన ఇంతకంటే మెరుగైన మద్యం కేవలం 100 రూపాయలకే అందుబాటులో ఉంటుండడంతో మద్యం ప్రియులు వీటిపైనే ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉండే మందు ధరకు ఇతర రాష్ట్రాల్లోని మందు సగం ధరకే లభించడంతో దానికి విపరీతమైన డిమాండ్ రావడంతో ఇక దాని అక్రమ రవాణా విస్తృంఖలత్వాన్ని దాల్చింది.

### మంచి బ్రాండ్స్ అందుబాటులో లేకపోవడమూ కారణమే

ధరలో భారీ వ్యత్యాసంతో పాటు గుర్తింపు పొందిన బ్రాండ్స్ అందుబాటులో లేకపోవడమూ మరో ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం లభ్యమవుతోన్న బ్రాండ్స్ అన్నీ రాష్ట్ర ప్రజలకు కొత్తగా పరిచయం అవుతోన్న పేర్లే. ప్రెసిడెంట్ మెడల్, బ్లాక్ బస్టర్, హై హెచ్‌డీ, బూమ్, కోల్ట్... ఇలా పెద్దగా పరిచయం లేని బ్రాండ్స్ కూడా కాకపోవడం అక్రమ రవాణాకు మరో ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణంగా మద్యం దుకాణాల్లోకి వెళ్తే వినిపించే పేర్లు కింగ్‌ఫిషర్, బడ్వైజర్, కార్ల్స్‌బర్గ్, హేన్‌కిన్, మేక్డోవెల్స్, బ్లెండర్స్‌ప్రైడ్, రాయల్‌స్టాగ్, మాన్షన్ హౌస్, ఆఫీసర్స్ ఛాయిస్ లాంటివి. కానీ ఇప్పుడు వాటికి భిన్నమైన బ్రాండ్స్, గతంలో మనం ఎప్పుడూ వినని బ్రాండ్స్ కూడా కాకపోవడంతో పాటు వాటి పేర్లు కూడా గుర్తు పెట్టుకోలేని మద్యంప్రియులు 200 రూపాయల క్వార్టర్ బాటిల్, 250 రూపాయల బాటిల్.. అంటూ అడుగుతుండడం విశేషం.

వీటితో పాటు 100 పైపర్స్, బ్లాక్ డాగ్, చివాస్ రీగల్, జానీవాకర్ లాంటి ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ ఇక్కడ అందుబాటులో ఉంటున్నా అవి కేవలం డిపోలకి మాత్రమే పరిమితంచేస్తూ వాటిని కూడా టార్గెటెడ్ కస్టమర్లకు మాత్రమే అందిస్తున్నారని, బహిరంగ మార్కెట్‌లో వాటి లభ్యత లేకుండా చేస్తున్నారన్న విమర్శలూ ఎక్కువ వినిపిస్తున్నాయి. వీటన్నింటి వల్ల మందుబాబులు ఇతర రాష్ట్రాల మద్యం వైపు దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.

### రాష్ట్రానికి నష్టం నెలకు 1000 కోట్ల పైనే

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఇటీవలి కాలంలో మద్యం అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. ఆదాయం కూడా అంతే స్థాయిలో పడిపోయింది. దీనితో నెలకి కనీసం 1000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఆమేర ఇతర రాష్ట్రాల మద్యం అమ్ముడుపోతోందని, రాష్ట్రం చుట్టూ ఉన్న సరిహద్దు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్‌ల నుంచి అనేక మార్గాల్లో మద్యం వస్తోందని, ఏపి మార్గాల్లో వస్తుందో ఇంకా ఎస్ఈబీకే తెలియదన్నది ఆ అధికారి వివరణ.

### 411 జీ ఓ ని సవరిస్తారా? రద్దు చేస్తారా?

ఇలాంటి పరిస్థితుల్లో హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని మరింత దెబ్బ కొట్టేలా ఉందంటూ సర్వత్రా చర్చించుకుంటున్నారు. వ్యక్తిగత వినియోగం కోసం ప్రతీ ఒక్కరూ కనీసం మూడు లీటర్ల మద్యాన్ని తమతో తరలించడం కానీ, ఇంటి వద్ద స్టాక్ చేసుకోవడం కానీ చేయవచ్చన్నది 411 జీ.ఓ ముఖ్య ఉద్దేశం. కానీ ఈ జీ.ఓలో ఆ మద్యం రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో విక్రయించిందే అని స్పష్టం చేయకపోవడంతో ఇప్పుడు చిక్కు వచ్చి పడింది. ఇటీవలి కాలంలో ఇతర రాష్ట్రాల నుంచి ఒక్క క్వార్టర్ బాటిల్ తెచ్చినా ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోంది. ఆ బాటిల్స్ కలిగి ఉన్న వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు, ఆ వాహనంలోని వ్యక్తులపైనా కేసులు నమోదు చేస్తున్నారు. ఆ వాహనాల్లో మహిళలు పిల్లలు ఉన్నా వాళ్ళ హ్యాండ్‌బ్యాగ్స్ సైతం వెతికే ప్రయత్నం చేస్తోన్న పోలీస్‌కి హైకోర్టు తాజా నిర్ణయం షాక్ ఇచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకున్నా సరే మూడు బాటిల్స్ ఉండొచ్చు అన్నది హైకోర్టు తాజా తీర్పు. ఆ తీర్పు వచ్చేందుకు వేసిన పిటిషన్ కూడా తెలంగాణ నుంచి మూడు బాటిల్స్ తెచ్చుకుంటుంటే వాహనాన్ని సీజ్‌చేశారని పిటిషనర్ హైకోర్టులో వేసిన పిల్ కారణం. దీంతో ఇప్పుడు 411 జీ.ఓని సవరిస్తూ రాష్ట్రంలో విక్రయించే మద్యానికి మాత్రమే పరిమితం చేయడమా, లేక ఆ జీ.ఓని రద్దు చేయడమో చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తానికి ఇలా మద్య నిషేధానికి ముందే రాష్ట్రాన్ని ఇతర రాష్ట్ర మద్యంతో నిషాలోకి నింపుతోన్న అక్రమ రవాణాదారులు ఇక నిషేధం ప్రారంభం అయితే ఏ స్థాయిలో చెలరేగబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అవినీతిపై ఉక్కుపాదం మోపుతోన్న సమయంలో అందివచ్చిన అవకాశంగా కొంతమంది అధికారులకు బంగారుబాతుగా మారిన ఈ అక్రమ రవాణా ఇక భవిష్యత్‌లో విచ్చలవిడి కానున్నదన్న విషయం ఇంకా కెక్కిక్కిస్తుంది.

# శ్రద్ధాంజలి



జననం : 07.01.1933 మరణం : 31.08.2020

నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తిత్వంతో
సేవ, సాహిత్య, విద్యా రంగాలలో గుర్తింపు తెచ్చుకున్న స్నేహాభిలాషి
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్

## జక్కా వెంకట్రామ్‌రెడ్డి (జె.వి.రెడ్డి) గారి

మృతికి నివాళులర్పిస్తూ... మా శ్రద్ధాంజలి.

**- జి.వి.కె.రెడ్డి,** ఛైర్మెన్

మరియు **కార్యవర్గ సభ్యులు**
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com